
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 23 జూలై 2025 | 5



నగరంలో మూడు జోన్లు

- వీధి వ్యాపారులకు జోన్లుగా విభజన
- అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వీధి వ్యాపారులకు అన్యాయం జరగకుండా జోన్ల వారీగా విభజించినట్టు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం తొలి టౌన్ వెండింగ్ కమిటీతో సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రణాళిక సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి రెడ్‌జోన్, యాంబర్ జోన్, గ్రీన్ జోన్లను గుర్తించినట్టు తెలిపారు. నగర పరిధిలో వీధులన్నీ జోన్ల వారీగా విభజించి నివేదికను సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. విద్యాసంస్థలు, వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించామన్నారు. నిర్ధేశిత సమయాలు,నిర్ధేశిత రోజుల్లో వ్యాపారాలు చేసుకునే ప్రాంతాలను యాంబర్ జోన్లుగా మిగతా ప్రాంతాలను గ్రీన్ జోన్లుగా ప్రకటించామన్నారు. నగరంలో మొత్తం 68 గ్రీన్ జోన్లు, 17 యాంబర్, 63 రెడ్ జోన్లుగా గుర్తించినట్టు తెలిపారు. పుష్కరఘాట్ సర్కిల్‌ను పూర్తిగా రెడ్‌జోనుగా ప్రకటించామన్నారు.నగరంలో గతంలో 16 వేల మంది వ్యాపారులు ఉండేవారని తాజాగా నిర్వహించిన సర్వేలో 1500 మంది కొత్త వ్యాపారులను గుర్తించినట్టు తెలిపారు. ఈ సమీక్షలో ఏసీపీ బి.నాగలక్ష్మి, వి.కొండలరావు, ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా శివాజీ, సీఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

ఇక శ్రావణానందమే!

- 26 నుంచి శ్రావణమాసం
- మోగనున్న పెళ్లి బాజాలు



అన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం వచ్చిందంటే ఆ సందడే వేరు.. ప్రతి ఇంటా పండగే.. ప్రతి ఇంటా లక్ష్మీ సందడే.. రావమ్మా మహాలక్ష్మి రావమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాలు ఆచరించడం ఆనవాయితీ.. అంటే కాకుండా ఈ మాసం అంతా శుభప్రదంగా ఉంటుందనేది భక్తుల నమ్మకం. ఏ కార్యక్రమైనా ఈ మాసంలోనే తలపెడుతుంటారు. సుమారు 40 రోజుల తరువాత ఈ నెల 26 నుంచి శుభ ముహూర్తాలు జోరందుకోనున్నాయి. మూఢం, ఆషాఢం ఒకేసారి రావడంతో జూన్ 6 తరువాత ఒక్కసారిగా ఆగిపోయిన శుభకార్యక్రమాలు తిరిగి శ్రావణం రాకతో ఊపందుకుంటాయి. ఈనెల 25 నుంచి శ్రావణమాసం ప్రారంభమవుండగా ఆగస్టు 17 వరకు వివాహం, గృహప్రవేశం వంటి శుభముహూర్తాలను పండితులు, పంచాగకర్తలు నిర్ణయించారు. శ్రావణమాసానికి సంబంధించి జూలై 30,31, ఆగస్టు 3,5,7,8,9,10,11,12,13,14,17 తేదీల్లో వివాహాది శుభ ముహూర్తాలను నిర్ణయించారు. వీటిలో జూలై 31, ఆగస్టు 8,9,10,13,14 తేదీల్లో అత్యంత బలమైన ముహూర్తాలుగా పండితులు తెలిపారు. శ్రావణ మాసం శుభముహూర్తాలతో కార్యక్రమాలు నిర్వహించే పురోహితులు, సన్నాయిమేళం, కల్యాణ మండపాలకు గిరాకీ ఏర్పడింది. క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్‌లు, వీడియోగ్రాఫర్లకు డిమాండ్ నెలకొంది. శ్రావణమాసంలో ఒక్క అన్నవరం దేవస్థానంలో సుమారు 600 వివాహాలు జరగవచ్చని అంచనా. ఆగస్టు 17 దాటితే భాద్రపదమాసం శూన్య మాసం కావడంతో నెలరోజులు శుభకార్యాలకు అవకాశం లేదు. మళ్లీ సెప్టెంబ రు 24 నుంచి నవంబరు 30 వరకు ముహూర్తాలున్నాయి.

శ్రావణం..శుభమస్తు 6

పర్యాటకంగా కడియం అభివృద్ధి చేస్తాం

కలెక్టర్ ప్రశాంతి



కడియం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : కడియం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి నర్సరీ రైతులకు మేలు చేయాలని కాంక్షిస్తున్నట్టు కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ చాంబర్‌లో సోమవారం పర్యాటక,ఉద్యానవన, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్షించారు.జిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా నర్సరీలు నిలస్తున్నాయన్నారు.వాటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక విధానంలో సమగ్ర అభివృద్ధి అవసరం అన్నారు. పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దే క్రమంలో మొదటి దశలో పొట్టిలంక నుంచి కడియపులంక వరకు 28 స్టాల్స్‌ను ప్రదర్శనతో పాటు విక్రయాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జేసీ చినరాముడు, పీడీ ఏ.దుర్గేష్, డీహెచ్‌వో మల్లిఖార్జునరావు, జిల్లా పర్యాటక అధికారి వెంకటాచలం, తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో రమేష్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నర్సరీ సంఘం ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, ముద్రగడ జమీ, పంతం గణపతి తదితరులు ఉన్నారు.

అనంతపాపం.. బద్దలు!

మళ్లీ వీధికెక్కిన హత్యకేసు



వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కార్‌లో డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం మృతదేహం (ఫైల్)

- డ్రైవర్ హత్య కేసులో కీలక మలుపు
- తదుపరి విచారణకు అనుమతి
- ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం తీర్పు
- జగన్ ప్రభుత్వం అనంత ప్రేమ
- పైపై ఆధారాలతో ఛార్జిషీట్
- న్యాయవాది ముప్పాళ్ల పోరాటం
- న్యాయం చేస్తామని లోకేశ్ హామీ
- ఎట్టకేలకు రంగంలోకి పోలీస్
- బెయిల్‌పై ఉన్న అనంతబాబు

(కాకినాడ/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఇన్నేళ్లపాటు పూర్తిగా పక్కన పడిపోయిన కేసును తదుపరి మరింత లోతుగా విచారణ జరిగేలా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ న్యాయ స్థానం మంగళవారం తీర్పునిచ్చింది. పోలీసులు దాఖలు చేసిన తొలి ఛార్జిషీటులో అనేక కీలక వాస్తవాలు విస్మరించిన నేపథ్యంలో బాధితుల విజ్ఞప్తి, ప్రాసిక్యూషన్ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కేసుపై 90 రోజుల్లోగా సప్లమెంటరీ ఛార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించింది. తాజా కోర్టు ఆదేశాలతో కేసు మరింత దర్యాప్తునకు మార్గం సుగమమైంది.

కారులో తీసుకెళ్లి.. డెడ్ బాడీ తెచ్చి..

ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లి హత్య చేశాడు. మే 19 తెల్లవారు జామున మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకొచ్చాడు. పలు పరిణామాల నేపథ్యంలో అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. గత వైసీపీ ప్రభుత్వం తన సొంత పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబుపై అవాజ్యమైన ప్రేమ కురిపించింది. అనంతబాబును కాపాడేందుకు కేసును నీరుగార్చేసింది. పైపై ఆధారాలతో న్యాయ స్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో అనంతబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో కొద్దిరోజులు శిక్ష అనుభవించి ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు.

ఇక అన్నీ తేల్చేస్తారు..

ఈ కేసుపై రాజమహేంద్రవరంలో సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు 2018లో తీవ్ర పోరాటం చేశారు. బెయిల్ రద్దు, విచారణ లోతుగా జరిగేలా కృషి చేశారు. అనంతబాబుపై గతంలో రౌడీషీట్ లేదని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొనడంపైనా పిటిషన్ దాఖలు చేశారు. రౌడీషీట్ ఉందని నిరూపించారు. న్యాయం కోసం బాధితులను వెంటబెట్టుకుని హైకోర్టు వరకు వెళ్లారు. అయితే వైసీపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో కేసు నీరుగారిపోయింది. గతేడాది ప్రభుత్వం మారాక కేసు విచారణ మలుపు తిరిగింది. ఎన్నికల సమయంలో బాధితులు నారా లోకేశ్‌ను యు.కొత్తపల్లి సభలో కలిసి తమకు న్యాయం చేయాలని కోరగా అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం మారాక ఈ ఏడాది మార్చి నుంచి కేసులో వేగం పెరిగింది. ఈ కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ముప్పాళ్లను ప్రాసిక్యూషన్‌కు సహకరించేందుకు వీలుగా ఏప్రిల్ 17న ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులకు కేసు తదుపరి విచారణకు అనుమతివ్వాలని కోరుతూ ప్రాసిక్యూషన్ రాజమహేంద్రవరం అట్రాసిటీ న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. హత్య అనంతరం జరిగిన దర్యాప్తులో అనేక కీలక అంశాలను విస్మరించిన నేపథ్యంలో లోతుగా కేసును విచారించాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొంది.తదుపరి విచారణకు అనుమతి మంజూరు చేయాలని కోరింది. మరోపక్క మృతుడి తల్లి నూకరత్నం సైతం తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్న విషయంపై ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేసిన అంశాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. ఈ కేసును తదుపరి విచారించేందుకు వీలుగా పాటిల్ దేవరాజ్ మనిష్ అనే ఐపీఎస్ అధికారిని కాకినాడ జిల్లా ఎస్పీ నియమించిన విషయాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. హత్య కేసులో మరికొందరు సాక్షులను విచారించాల్సి ఉండడం, మరిన్ని సాంకేతిక ఆధారాలు సేకరించాల్సి ఉన్న నేపథ్యంలో తదుపరి విచారణకు అనుమతి కోరింది. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని అట్రాసిటీ న్యాయస్థానం కేసు

కేసుపై మళ్లీ విచారణ

లోతైన విచారణ చేయడంతోపాటు 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాలని కోర్టులో దాఖలైన పిటిషన్‌పై రాజమహేంద్రవరం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కార న్యాయస్థానం న్యాయమూర్తి సింగవరపు ఉమా సునంద మంగళవారం తీర్పు ఇచ్చారు. దీంతో అనంతబాబు వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అనంతబాబుపై తిరిగి పూర్తి విచారణ జరగనుంది. న్యాయసలహాదారుగా న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు.. పీపీలు కె.రాధా కృష్ణ, డి.శ్రీవాణి వాదించారు.

తదుపరి విచారణకు అనుమతివ్వడంతో మరింత లోతుగావిచారణ జరగనుంది.

తల్లి ఫిర్యాదు.. సిట్ టీమ్

తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్నాయని ఇప్పటికే డీజీపీకి మృతుడి తల్లి నూకరత్నం ఫిర్యాదు చేశారు. దీంతో డీజీపీ కార్యాలయం నుంచి కాకినాడ ఎస్పీ బిందుమాధవ్‌కి వెంటనే యాక్షన్ తీసుకోవాలని ఆదేశాలు అందాయి. విచారణకు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించడంతోపాటు 60 రోజుల్లో నివేదిక ఇచ్చి తదుపరి యాక్షన్‌కు కోర్టును అనుమతి కోరాలని ఆదేశించారు. ఈ ఏడాది కేసు విచారణకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను నియమిస్తూ కాకినాడ ఏఎస్పీ పి.దేవరాజ్ మనీష్ మెమో జారీచేశారు. ఆ టీమ్‌లో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, ఎస్‌ఐలు బి.వినయ్‌ప్రతాప్, పి.శ్రీనివాసకుమార్, హెడ్ కానిస్టేబుల్ కె.రామకృష్ణ, కానిస్టేబుల్ ఎం.సతీష్ ఉన్నారు.

ఎవరూ తప్పించుకోలేరు..



దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో ఎవరూ తప్పించుకోలేరు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు అతనికి సహకరించిన వారికి శిక్ష పడుతుంది. ఇప్పటికే ప్రభుత్వం సిట్‌ను నియమించింది.. సిట్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసి కోర్టుకు సమర్పించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అనంతబాబును కాపాడడానికి శక్తివంచన లేకుండా పనిచేసింది. కానీ ప్రజా పోరాటాల వల్ల కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. ఆనాటి కాకినాడ ఎస్పీ, ఇతర అధికారులు అనేక తప్పిదాలు చేశారు.ఈ కేసులో ఎవరెవరు ఏ పాత్ర పోషించారో తేల్చే అవకాశాలు ఉన్నాయి.

- ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది

సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరిస్తాం

ఎన్‌టీఆర్ వర్సిటీ వీసీ చంద్రశేఖర్



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంగళవారం సందర్శించి మాట్లాడారు. యూనివర్సిటీ నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో చదివేలా ఫ్యాకల్టీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. ర్యాగింగ్ వంటివి జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, బోధనాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ కెన్నడీ,ప్రొఫెసర్లు తదితరులుపాల్గొన్నారు.

జక్కంపూడి రాజా హౌస్ అరెస్టు

- మిల్లు కార్మికుల కోసం దీక్ష
- అడ్డుకున్న పోలీసులు



మాజీ ఎమ్మెల్యే రాజాతో వైసీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాజమహేంద్రవరంలో ఏపీ పేపరుమిల్లు కార్మికులకు వేతన ఒప్పందం విషయంలో మంగళవారం నుంచి నిరవధిక దీక్ష చేస్తానని ఆయన ప్రకటించారు.ఈ మేరకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో త్రీటౌన్ పోలీసులు కృష్ణసాయి కల్యాణ మండపానికి చేరుకుని జక్కంపూడి రాజాను అదుపులోకి తీసుకుని దానవాయిపేటలోని ఆయన నివాసానికి తీసుకెళ్లి హౌస్ అరెస్టు చేశారు.మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ,మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, కౌడా మాజీ ఛైర్మన్ రాజిరెడ్డి, కర్రి పాపారాయుడు తదితరులు రాజా నివాసానికి చేరుకుని మద్దతుగా నిలిచారు.అనంతరం రాజా విలేకరులతో మాట్లాడుతూ పేపరుమిల్లు కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారు.రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గత ఐదేళ్లూ ఏమయ్యారు : టీడీపీ

గడచిన ఐదేళ్లలో పేపరుమిల్లు కార్మికులకు వైసీపీ ప్రజాప్రతినిధులు ఎందుకు న్యాయం చేయలేకపోయారని టీడీపీ నేతలు యిన్నమూరి దీపు, నక్కా దేవి వరప్రసాద్ ప్రశ్నించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు పేపరుమిల్లు కార్మికుల కోసం దీక్షలు చేస్తామంటున్న వైసీపీ నాయకులు స్థానిక మార్గాని ఎస్టేట్ వద్ద చేస్తే బాగుంటుందన్నారు. ఎందుకంటే మిల్లు కార్మికులకు న్యాయం చేయకుండా పరంపర పేరుతో దోపిడీ చేసిన సొమ్ము భరత్ చేత కక్కించాలన్నారు. త్వరలో మిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేసేందుకు ఎమ్మెల్యే వాసు ,ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్ కృషి చేస్తుంటే ఇప్పుడు రాజకీయం చేయాలనుకోవడం తగదన్నారు.సమావేశంలో నాయకులు ఆదారి లక్ష్మీనారాయణ, చింతపల్లి నాని, కందికొండ అనంత్, జయరామ్ పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న సీఈ

ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం

సీఈ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తేవాలని ఏపీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆవరణలో నిర్మించనున్న ప్రధాన ఆసుపత్రి భవనం స్థలాన్ని, మ్యాప్ ద్వారా డిజైన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈఈ, డీఈలకు తగు సూచనలు చేశారు. నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజ్ భవనం పనులు పరిశీలించి పురోగతిపై ఆరా తీశారు. తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ త్వరలోనే మెడికల్ కాలేజీ శాశ్వత భవనం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రెండేళ్లలో జిల్లా ఆసుపత్రి ప్రధాన భవనాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈఈ చంద్రమౌళి, డీఈ కృష్ణారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షల కార్యక్రమం విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తామన్నారు.



ఈఎస్ఐ ఆసుపత్రి భవనం

ఈఎస్ఐ ఆసుపత్రి.. అదిరే!

- కార్పొరేట్‌కు దీటుగా 100 పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రి
- రూ.56 కోట్లతో రాజమహేంద్రవరంలో నిర్మాణం
- మరో వారంలో ఆరంభించడానికి సన్నాహాలు
- సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆధునిక వైద్య సదుపాయాలతో రాజమహేంద్రవరంలో కార్మిక ప్రభుత్వ బీమా వైద్యశాల (ఈఎస్ఐ ఆస్పత్రి) ఆసుపత్రి సిద్ధమైంది. మరో వారంలో అందుబాటులోకి రానుంది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ మురళీమోహన్ చొరవతో పునాది రాయి పడింది. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తుది మెరుగులు అద్దుకుని వైద్య సేవలకు సన్నద్ధమైంది. వైద్య పరికరాలు/యంత్రాలు/వస్తువులు ఇంకా రావాల్సి ఉంది. ఐదేళ్ల కల సాకారం కావడం, పేద కార్మికులకు అధునాతన వైద్య సదుపాయం అందుబాటులోకి రానుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

రూ.56 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం

ఆస్పత్రి నిర్మాణానికి రూ.97.98 కోట్లను 2020 ఆగస్టు 19న కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 5.83 ఎకరాల విస్తీర్ణంలో రూ.56 కోట్లతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. వాస్తవానికి 2022 జూలై 10వ తేదీకి నిర్మాణం పూర్తి కావాల్సి ఉన్నా 2024 డిసెంబరు 30కి పూర్తయింది. ఆరు నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఈఎస్ఐ కార్పొరేషన్ బదిలీ చేసింది. 1987లో 50 పడకల ఆస్పత్రిగా సేవలు ప్రారంభించగా ఇప్పుడు 100 పడకల ఆస్పత్రిని నిర్మించారు. అయితే ఆ స్థాయికి అప్ గ్రేడ్ కావాల్సి ఉంది. అప్పుడే ఆ స్థాయికి తగి నట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయి. ఇప్పటికే ఆస్పత్రికి అవసరమయ్యే యంత్రాలు,పరికరాలు, మానవ వనరులు, నిర్వహణ వంటి వాటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఏర్పాటు చేయకపోవడంతో బయటి ఆస్పత్రులకు రిఫర్ చేయడం తప్పకపోవచ్చు. భారీ వ్యయంతో నిర్మించిన ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.ఎంపీ పురందేశ్వరి కల్పించుకుని పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది, యంత్ర పరికరాలు త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కార్మికులు కోరుతున్నారు.

ఏ ఫ్లోర్‌లో ఏముంటాయి..

గ్రౌండ్ ఫ్లోరులో 32 గదుల్లో ఓపీ, వ్యాధి నిర్ధారణ, ఈసీజీ,ఎక్స్‌రే, క్యాజువాలిటీ, క్యాజువాలిటీ ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, క్యాంటీన్, లాండ్రి, ఆయుర్వేద,హోమియో, ఎమర్జెన్సీ వార్డు,ఫిజియోథెరపీ తదితర సేవలు ఉంటాయి.రెండో ఫ్లోరును పూర్తిగా మాతా శిశువుల కోసం కేటాయించారు.వారికి సంబంధించిన అన్ని వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐసీయూ, పీఐసీయూ, హెచ్‌డీయూ, ఎన్‌ఐసీ యూ, ఎస్‌ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ప్రొసీజర్ రూమ్స్, లాకర్లు ఇలా 26 రూములు నిర్మించారు. మూడో ఫ్లోరులో 12 పడకల చొప్పున 6 వార్డులు ఉండగా.. పురుషులకు, మహిళలకు విడివిడిగా విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు.వార్డుల్లో సైతం ఆక్సిజన్, వెంటిలే టర్, వంటి సదుపాయాన్ని కల్పించారు. ఇదే ఫ్లోరులో లైబ్రరీ, బ్లడ్ స్టోరేజీ, ఎంఆర్‌డీ, పరిపాలన గదులు ఉంటాయి. వైద్యులు, సిబ్బంది క్వార్టర్స్ ఆస్పత్రి ప్రాంగణంలోనే నిర్మించారు. టైప్ 2, 3, 4, టైప్ 4 స్పెషల్ విభాగాలుగా మొత్తం 32 ప్లాట్లు ఉన్నాయి.

12 డిస్పెన్సరీలకు పెద్దాసుపత్రి..

ఆస్పత్రి పరిధిలో రాజమహేంద్రవరం, సీతంపేట, లాలా చెరువు, ఇన్నీసుపేట, కడియం, ధవళేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, వేండ్ర డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల నుంచి కార్మికులను ఈ ఆసుపత్రికి రిఫర్ చేస్తారు.


ఔరా అనిపించేలా..



ఆసుపత్రిని ఔరా అనిపించేలా నిర్మించారు. మహిళా శిశు వైద్య విభాగానికి ఏకంగా ఒక ఫ్లోర్‌నే కేటాయించారు.ఈ విభాగం అద్భుతమనే చెప్పాలి. సెకండరీ కేర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, ఆర్థో, ట్రామా కేర్‌తో సహ 26 రకాల వైద్య సేవలను అందించనున్నారు. సెంట్రల్ ఏసీ సదుపాయంతో పాటు భద్రతకు 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రీనరీ, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, లాండ్రీ, క్లాత్ వాషింగ్ ఇలా అన్ని సదుపాయాలు ఆధునికంగానే ఉన్నాయి. ప్రతి వార్డులోని ప్రతి మంచం వద్ద ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం ఉంది. రోగులు వేచి ఉండే ప్రదేశం, ఆపరేషన్ థియే టర్లు విశాలంగా నిర్మించారు.స్ట్రెచర్ పట్టే విధం గా నాలుగు లిఫ్టులు ఉన్నాయి. అందులు ఇబ్బంది పడకుండా మెట్లు, లిఫ్టుల వద్ద బ్రెయి లీ లిపితో బోర్డులు ఏర్పాటు చేశారు.

సిబ్బంది కావలెను..

ప్రస్తుతం 50 బెడ్స్ స్థాయిలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్, పరిపాలన కలిపి కేవలం 30 మంది మాత్రమే ఉన్నారు. కొత్త ఆస్పత్రిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే కనీసం 300-350 మంది సిబ్బంది అవసరం అవుతుంది. మూడు కుపైగా ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర వైద్య విభాగాలు ఉండడంతో షిఫ్టుల వారీగా పనిచేయాల్సి వస్తుంది. అందువల్ల 100 మంది వరకూ డాక్టర్లు ఉండాలి. ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ సిబ్బంది 200 మంది వరకూ అవసరం అవు తుంది. వీరిని ప్రభుత్వం నియమించే వరకూ ఉన్నవాళ్లతో నెట్టుకురాక తప్పని పరిస్థితి ఉంది. కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రిని కేంద్ర ప్రభుత్వమే చూసుకుంటుంది. రాజమహేంద్రవరం ఆస్పత్రి నిర్వహణ అంతా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు.



ఈఎస్ఐ ఆసుపత్రి లోపల విభాగం

శ్రావణం.. శుభమస్తు!



(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

కల్యాణ శోభను సంతరించుకుని మరో రెండు రోజుల్లో మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడనుంది. ఆషాఢమాసం నిరాశను మిగల్చగా శ్రావణ మాసంకోసం మార్కెట్‌లో అన్నివర్గాల ప్రధాన వ్యాపారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శ్రావణమాసం నుంచి వివాహాది శుభ ముహూర్తాలు మెండు ఉండడంతోపాటు వరుసగా పండుగలు, నోములు, వ్రతాలు ఉన్నాయి. కొత్తగా పెళ్లి అయిన దంపతులు ఆషాఢమాసం కారణంగా నెల రోజుల పాటు దూరంగా ఉన్నారు. వారంతా శ్రావణమాసం కోసం ఎదురుచూస్తున్నారు. పుట్టింట ఉన్న భార్యను మెట్టినింటికి తీసుకువెళ్లేందుకు వారి వ్యక్తిగత నామ నక్షత్రాలను బట్టి సిద్ధాంతులు ముహూర్తాలను నిర్ణయిస్తున్నారు. కొందరికి ముందుగా ముహూర్తం కుదిరితే మరికొందరికి ఇంకొంత ఆలస్యమవుతుంది. గత రెండు నెలలుగా పెళ్లిళ్లు లేవు. పండుగలు, ఇతర శుభ కార్యక్రమాలు అంతంత మాత్రమే. వస్త్ర వ్యాపారం, బంగారం కొనుగోళ్లు ఇలా ఎన్నో వ్యాపారాలు డీలా పడిపోయాయి. ఆషాఢమాసం అలా ముగుస్తుందో లేదో ఒక్కసారిగా మార్కెట్‌లో కొత్త శోభ సంతరించుకుంటుంది. ఆషాఢం వెళ్తావెళ్తూ శ్రావణ శోభను తీసుకువస్తుంది. శ్రావణమాసపు అమ్మకాలు ఏ స్థాయిలో ఉంటాయో అంచనాలు వేసుకుని ఇప్పటికే కొనుగోల్లు జరిపి వస్త్ర వ్యాపారులతో అన్ని వ్యాపార సంస్థలు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. శ్రావణంం అంటేనే పండుగలు. దానికితోడు వివాహాది శుభకార్యాలు మెండుగా ఉండడంతో మార్కెట్ ఊపందుకోనుంది.

- ప్రారంభం కానున్న శ్రావణ శోభ
- 25నశుక్రవారం శ్రావణ మాసం ప్రారంభం
- మెండుగా వివాహాది ముహూర్తాలు.. నిండుగా పండుగలు

శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం 'శ్రవణ'

అమావాస్యతో ఆషాఢమాసం ముగిసి శుక్రవారం నుంచి శ్రావణ సందడి మొదలవుతోంది. ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాసం. ఈ శ్రావణమంతా నోములు, వ్రతాలు, పండుగలతో ప్రతీ ఇంటా సందడే. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ. ఆ పేరు మీద వచ్చిన శ్రావణమాసం కావడంతో శ్రీలక్ష్మీదేవికి ఎంతో ఇష్టం. శ్రావణ సోమవారం వ్రతాన్ని పరమశివుని ప్రీత్యర్థం జరుపుకుని భక్తులు ఉపవాసాలుంటారు. ఇక ప్రతీ మంగళవారం కొత్తగా వివాహమైన స్త్రీలు మంగళగౌరీ వ్రతాలు జరుపుకుంటారు. తిథి, నక్షత్రాలను బట్టి సూపౌదన వ్రతం, అవ్యంగ సప్తమీ వ్రతం, పుష్పాష్టమి వ్రతం, అనంగ వ్రతం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇక ఆగస్టు 8న ప్రతి ఇంటా వరలక్ష్మీ వ్రతాలు జరుపుకుంటారు. ఆరోజున వీలుపడని వారు జూలై 25, ఆగస్టు 1, 15, 22 తేదీల్లోను వరలక్ష్మీవ్రతాలు చేసుకుంటారు. ఈ ఏడాది ఐదు శ్రావణ శుక్రవారాలు రావడం విశేషం. ఈ నెల 27న స్వర్ణగౌరీ వ్రతం, 28న నాగచతుర్థి, 29న మంగళగౌరీ వ్రతం, నాగపంచమి, గరుడపంచమి జరుపుకుంటారు. 30న సూర్యషష్ఠి, ఆగస్టున 7న వరాహ జయంతి, 8న వరలక్ష్మీ వ్రతం, 9న వచ్చే పౌర్ణమి.. రాఖీ పౌర్ణమి. ఇక జంధ్యాల పౌర్ణమి కూడా కావడంతో జీర్ణమయ యజ్ఞోపవీతాలను విసర్జించి కొత్తవాటిని ధరిస్తారు. 15న వచ్చే శ్రీకృష్ణ జన్మాష్టమిని అయితే పాఠశాల విద్యార్థులు వారం రోజుల ముందు నుంచే జరుపుకుంటారు. 16న వైష్ణవ శ్రీకృష్ణ జయంతి, 22న పోలాంబ వ్రతం జరుపుకుంటారు. - కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, బండారులంక

పండుగలే పండుగలు.. జూలై 29న నాగపంచమి.. ఆగస్టు 8న వరలక్ష్మి వత్రం



అంబాజీపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రావణం రాకతో ఊరువాడా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. అమ్మవారి ఆలయాలన్నీ కొత్తశోభనను సంతరించుకుంటున్నాయి. మనసుకు ప్రశాంతత కల్పించే ఈ మాసంలో మహిళలు సకల సౌభాగ్యాలతోపాటు శ్రీమహాలక్ష్మి అమ్మవారి కటాక్షం పొందేందుకు వ్రతాలు, ఉపవాసాలు, ఆరాధనలు ప్రారంభించనున్నారు. మహిళలంతా భక్తిప్రపత్తులతో కుంకుమ పూజలు ఆచరిస్తున్నారు. పున్నమి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసంలో ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క విశిష్టత ఉందని పండితులు పేర్కొన్నారు. ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారల్లోనూ శ్రావణలక్ష్మి పూజలు చేస్తారు. ఈ ఏడాది శ్రావణమాసం జూలై 25 నుంచి ప్రారంభమం కానుంది. వివాహితులు ఈనెలలో నోములు, వ్రతాలతో గడుపుతారు. వరలక్ష్మి వ్రతం రోజున అమ్మవార్కి కలశం పెట్టి నిండుగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ఇలా చేస్తే ఆయురోగ్యాలతోపాటు సౌభాగ్యం లభిస్తుందని విశ్వాసం. ఈనెలలో ప్రధానంగా 29వ తేదీన నాగుల పంచమి, ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 12న సంకష్ట హర చతుర్థి, 16న శ్రీకృష్ణాష్టమి, 19న అజ ఏకాదశి, ఆగస్టు 23న పోలాల అమావాస్య, శ్రావణమాసం ముగింపు, ఆగస్టు 27న వినాయక చవితి పండుగలు జరగనున్నాయి. తమ భర్తలు, కుమారులు పంటపొలాల్లో సంచరించే సమయంలో ఎలాంటి హానీ తలపెట్టోందని నాగేంద్రుడుని మహిళలు పూజించే పండుగే నాగుల పంచమి. సోదర క్షేమాన్ని తమకు రక్షణ భాగ్యాన్ని కల్పించమని కోరుతూ నిర్వహించేదే రాఖీ పౌర్ణమి వేడుక. అలాగే యజ్ఞోపవీతాన్ని ధరించేందుకు జంధ్యాల పౌర్ణమి, గ్రామదేవతలను కొలిచేందుకు చేసుకునే పోలాల అమవాస్య పండుగ తదితర పర్వదినాలు ఈ మాసంలో వస్తాయి. అలాగే శ్రావణ మాసంలో వచ్చే నాలుగు మంగళవారాలకు మహిళలు మంగళగౌరిని పూజిస్తారు. పార్వతిదేవికి మరో పేరే మంగళగౌరి. కొత్తగా వివాహమైన వధువులు ఈ వ్రతం ఆచరిస్తే సౌభాగ్యం. ఐదోతనం కలకాలం సిద్ధిస్తుందని విశ్వాసం. మరో ముఖ్యమైన శ్రీ వరలక్ష్మి వత్రం ఆచరిస్తే అష్టలక్ష్మిలను కొలిచినట్టే. పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం ఆచరించడానికి మహిళలు ఎదురు చూస్తున్నారు. ఇక శ్రావణ మాసం సందర్భంగా పలు అమ్మవారి ఆలయాలతోపాటు ప్రముఖ ఆలయాలు ముస్తాబుకానున్నాయి. అనునిత్యం వ్రతాలు, హోమాలు నిర్వహిస్తారు.

అపురూపం అనుగ్రహం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో శాకంబరిగా దర్శనమిచ్చిన అన్నపూర్ణాదేవి

ఆషాఢ మాసంలో గ్రామ దేవతలను కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లను మంగళవారం వివిధ రూపాల్లో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అమ్మవార్ల అనుగ్రహం పొందారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లిని పసుపుకొమ్ములు, నెమలి పింఛాలతో అలంకరించిన దృశ్యం

ఐటీఐల్లో ప్రవేశానికి నేడు, రేపు రెండో విడత కౌన్సెలింగ్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో 2025-26 సంవత్సరానికి గాను రెండో విడత ప్రవేశానికి 1035 అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారు. వారికి మెరిట్ లిస్టు ప్రకారం కౌన్సెలింగ్ ప్రక్రియ కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 23, 24 తేదీల్లో జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్‌వర్మ తెలిపారు. 23వ తేదీ ఉదయం 8 గంటలకు 9.7 నుంచి 6.2 జీపీఏ గ్రేడ్ వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 6.1 నుంచి 5.2 జీపీఏ గ్రేడ్ వరకు, 24వ తేదీ ఉదయం 8 గంటలకు 5.1 నుంచి 4.3 జీపీఏ గ్రేడ్ వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 4.2 నుంచి 2.0 జీపీఏ గ్రేడ్ వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. అభ్యర్థులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

కాలుష్యకారక పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలి


ఉమ్మడి జిల్లా మహాసభలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క పిఠాపురంలో కార్మికుల భారీ ప్రదర్శన



పిఠాపురంలో జరిగిన ఏఐటీయూసీ మహాసభలో మాట్లాడుతున్న విమలక్క

పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారుల పొట్టగొడుతున్న కాలుష్యకారక పరిశ్రమల అనుమతులను రద్దు చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క డిమాండ్ చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభ కాకినాడ జిల్లాలోని పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో మంగళవారం జరిగింది. తీర ప్రాంతంలో ఉన్న ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యకారక వ్యర్థాలను సముద్రంలోకి వదిలివేస్తుండటంతో మత్స్యసంపద చనిపోతోందన్నారు. హేచరీలు దెబ్బతింటున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన వక్త, ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్‌మీటర్లను బలవంతంగా బిగిస్తున్నారని, దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. కార్మిక చట్టాల అమలుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పిఠాపురం వీధుల్లో కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉపాధి కూలీల వేతనాన్ని రూ.600కి పెంచాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గొల్ల అంజియ్య, అరుణోదయ సమాఖ్య ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు ఏపూరి సుధాకర్, మల్సూర్ ఖదీర్, ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, బి.రమేష్, డొక్కులూరి సంగీత, కె.బోజీ, డి.నారాయణమూర్తి, మడికి సత్యం, గుడాల చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు డీసీసీబీ చైర్మన్ పూజలు



పెద్దాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) సతీసమేతంగా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. మరిడమ్మ దేవస్థానంలో నిత్యాన్నదానానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మరిడమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు మంగళవారం ఆయన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి అన్న ప్రసాదం వడ్డించారు. సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. టీడీపీ నేత రాజా సూరిబాబురాజు, జనసేన నాయకుడు పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

సోలార్ శక్తి, మారిటైం నైపుణ్య రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యం

ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నలకు కేంద్ర మంత్రుల సమాధానం

కాకినాడ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోలార్ శక్తి, మారిటైం నైపుణ్య రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తామని కేంద్ర న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ, శాఖ మంత్రి శ్రీపాద యశో నాయక్, కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ సానా సతీష్‌బాబు అడిగిన రెండు ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. సోలార్ విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ స్థిరమైన పురోగతి సాధ్యమవుతుందని వివరించారు. మొత్తం 1,454.86 మెగా వాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సామర్థ్యం రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. కేంద్ర పథకాల ద్వారా 3,300 మెగావాట్లతో పార్కుల అభివృద్ధి, 38వేల కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ద్వారా విద్యుత్, లక్ష వ్యవసాయ పంపులు పీఎం కిసాన్ కింద కేటాయింపు, 400 మెగావాట్ల ఈపీసీ ఒప్పందాలు జరిగాయని తెలిపారు. మారిటైం నైపుణ్యాభివృద్ధి-విశాఖ సీఈఎంఎస్ కేంద్రం దేశంలోనే అత్యుత్తమంగా ఉందన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం, షిప్ బిల్డింగ్ కేంద్రాలు దేశంలో రెండు ఉన్నాయని.... వీటిలో విశాఖలో 22, ముంబయిలో 6 ల్యాబ్స్ ఉన్నాయని వెల్లడించారు. కాకినాడ వంటి తీర ప్రాంతాల్లో కూడా ఇలాంటి ప్రాజెక్టులకు కేంద్రం ప్రాధాన్యమిచ్చేలా ఎంఎన్ఆర్ఈ, ఎస్ఈసీఐ సంస్థలతో చర్చలు కొనసాగిస్తానని ఎంపీ చెప్పారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు





సూక్ష్మపోషకాలు వేసిన పొలంలో వరి పంట.. సూక్ష్మపోషకాలు అవసరత ఉన్న చౌడు బారిన పొలం

సూక్ష్మ పోషకాలతో అన్నీ లాభాలే!

- పంట ఎదుగుదలలో కీలక పాత్ర
- చౌడు నివారణకు దోహదం
- దిగుబడులు పెరిగే అవకాశం
- నూరు శాతం సబ్సిడీపై అందిస్తే రైతుకు దన్ను
- గతంలో ఇదే విధంగా పంపిణీ చేసిన టీడీపీ ప్రభుత్వం

భూసార పరిరక్షణ, పంటలు పుష్కలంగా పండాలంటే సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉండాలి. ఇవి సమతుల్యంగా లేకుండా ఉంటే భూమి చౌడు బారుతుంది. దిగుబడులు తగ్గిపోతాయి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సూక్ష్మపోషకాలను వినియోగిస్తే రైతులకు అన్నీ లాభాలే. వీటిని నూరుశాతం సబ్సిడీపై అందిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే రీతిలో ఇచ్చిన విషయాన్ని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.



2019 వరకు టీడీపీ ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీపై అందించిన జింక్ సల్ఫేట్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పంట ఆరోగ్యంగా ఎదిగి సమృద్ధిగా పండడానికి, దిగుబడులు ఆశాజనంగా లభించడంలో సూక్ష్మ పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయి. సూక్ష్మ పోషకాలు(మైక్రోన్యూట్రియంట్స్) అయిన జింక్, ఐరన్, మాంగనీస్, రాగి, బోరాన్, గంధకం వంటివి సమతుల్యంగా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. పంట భూముల్లో సూక్ష్మపోషకాలు సరిపడా లేకున్నా నిర్దేశించిన ప్రమాణాల్లో అవి లేకున్నా పంట భూములు చౌడుగా మారతాయి. సూక్ష్మధాతు లోపం ఉన్నట్టు గుర్తించిన పొలాల్లో వీటిని వేయడం ద్వారా పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చు. క్రమం తప్పకుండా వినియోగిస్తే చౌడుబారిన భూములను సారవంతంగా మారుస్తాయి. భూసార పరీక్షల ద్వారా వీటి లోపాలను గుర్తించి ముందుగానే వినియోగిస్తే దిగుబడులు ఆశాజనకంగా లభిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న 30 శాతం పంటభూముల్లో ఏదొక సూక్ష్మ పోషక లోపం ఉన్నట్టు పరిశీలనలో వెల్లడైంది.

వరి దిగుబడుల్లో జింక్ కీలక పాత్ర

వరి దిగుబడుల్లో జింక్‌కు అధిక ప్రాధాన్యత ఉంది. మొక్క ఎదుగుదలకు, నత్రజని, భాస్వరం, ఇతర పోషక పదార్థాల సమర్థ వినియోగానికి, మొక్కలో అమినో ఆమ్లాలు, మాంసకృత్తుల తయారీకి దోహదపడుతుంది. జింక్ లోపిస్తే ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి చిన్నవిగా అవుతాయి. పంటలో ఎక్కువ మోతాదులో నత్రజని, భాస్వరం ఎరువుల వాడకం వల్ల జింక్ లోపం వస్తుంది. ఒకేసారి వరి పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించే చోట రబీ సీజను ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. లోపం నివారణకు ఎకరాలకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింక్‌ను భాస్వరం ఎరువులతో కలిపి వేయకూడదు.

బోరాన్ ధాతు ప్రాముఖ్యత

వరితోపాటు అపరాలు, కాయగూరలు, పత్తి మొక్కల పూత దశలో సంపర్కం, ఫల దీకరణ, ఆకుల్లో తయారయ్యే ఆహారం మొక్కల్లోని అన్ని భాగాలకు చేర్చడంలో బోరాన్‌దే కీలక పాత్ర. సున్నంపాలు ఎక్కువుండే నేలల్లో బోరాన్ లోపం అధికంగా కనిపిస్తోంది. లోపం ఉన్న చెట్ల ఆకులు ముడుచుకుపోయి చిన్నవిగా తయారవుతాయి. కాయ దశలో కాయలు పగిలిపోతాయి. ఎకరానికి ఒక కిలో బోరాక్స్‌ను ఆఖరి దుక్కులో వేయాలి. బోరాన్ లోప నివారణకు ప్రతి మొక్కకు 100 గ్రాముల బోరాక్స్ లేదా బోరికామ్లాన్ని భూమిలో వేయాలి. 0.1-0.2 శాతం బోరాక్స్ లేదా బోరి కామ్లాన్ని కొత్తగా చిగురు వచ్చినప్పుడు 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నీటిపారుదల కింద సాగుచేసే పంటకు విత్తే సమయంలో ఎకరానికి నాలుగు కిలోల బోరాక్స్ వేయాలి.

జిప్సంతో చౌడు నివారణ

సూక్ష్మపోషకాల్లో కీలకమైన జిప్సం వినియోగించడం ద్వారా చౌడు భూములను తిరిగి పంటల సాగుకు అనుకూలంగా చేయవచ్చు. జిప్సం ఎరువులో కాల్షియం, గంధకం ధాతువులు ఉంటాయి. చౌడు భూముల్లో ఉండే మార్పిడి చెందే సోడియం తగ్గించి నేలను బాగు చేయడానికి జిప్సం ఎరువు అవసరం. జిప్సం ఎరువులోని కాల్షియం ధాతువు మొక్కలో కణకవచం తయారీకి, కణాల ఉత్పత్తి, సాగుదలకు, మొక్కల్లో సేంద్రియ ఆమ్లాలను తటస్థపరచడానికి, పత్రహరితం, క్రోమోజోములు ఏర్పడ్డానికి దోహదం చేస్తుంది. కారుచౌడు నేలలను బాగు చేయడానికి వేసవి వర్షాల సమయంలో జిప్సం వేసి కలియదున్నాలి. తర్వాత పొలంలో నీటిని నిలపాలి. భూసార పరీక్షా ఫలితాలకు అనుగుణంగా జిప్సం ఎరువు మోతాదును వేయాలి. అవి లేకుంటే ఎకరానికి 1.2-1.6 టన్నులు జిప్సం వేయవచ్చు. నూనె గింజల పంటలకు ఎకరాకు 200 కిలోల జిప్సం చివరి దుక్కిలో వేయాలి. వేరుశెనగ పైరుకైతే పూత దశలో వేసి నేలలో కలపాలి. సోయాచిక్కుడు, కంది, పెసర, మినుము, శనగ వంటి పైర్లకు జిప్సం ఎరువును చివరి దుక్కులో ఎకరానికి 50-100 కిలోలు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

మిగిలిన సూక్ష్మపోషకాలదీ ఇంతే..

ఇతర సూక్ష్మపోషకాల్లో కీలకమైన ఐరన్ ధాతు లోప నివారణకు ఎకరానికి 20కిలోల అన్నభేదిని ఆఖరి దుక్కులో వేయాలి. పైరుపై ఐరన్ ధాతు లోపాలు కనిపిస్తే ఎకరానికి ఒక కిలో అన్నభేది, 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాన్ని 200లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఎకరానికి 10 కిలోల మాంగనీస్ సల్ఫేట్ చివరి దుక్కులో వేయాలి. మొక్కలో విటమిన్-ఎ తయారీకి దోహదం చేసే రాగి ధాతువు కోసం ఎకరానికి రెండు కిలోల కాపర్ సల్ఫేట్‌ను 2-3 సంవత్సరాలకు ఒకసారి దుక్కులో వేయాలి.

టీడీపీ హయాంలో 100% సబ్సిడీ

వరి సహా అన్ని రకాల పంటల సాగులో కీలక పాత్ర పోషించే సూక్ష్మపోషకాలైన జింక్, బోరాన్, జిప్సంలను 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం భూసార పరీక్షలకు అనుగుణంగా నూరుశాతం సబ్సిడీపై ఎన్ఎఫ్ఎస్ఎం పథకం ద్వారా రైతులకు అందించింది. అంతకుముందు వీటిని 75-90 శాతం సబ్సిడీపై అందించేవారు. వీటిని రైతులు తమ భూములకు వినియోగించుకుని సత్ఫలితాలు పొందేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి సూక్ష్మపోషకాల సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఇప్పుడు పొలంబడి రైతులకు మాత్రమే ఇస్తున్న సూక్ష్మపోషకాలను గతంలో మాదిరిగా భూసార పరీక్షల ఆధారంగా నూరుశాతం సబ్సిడీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

దివాన్‌చెరువులో ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయం

పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఇకపై ఇక్కడి నుంచే ఉచిత పాఠ్య పుస్తకాల సరఫరా



దివాన్‌చెరువు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసే జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయం ఇటీవల దివాన్‌చెరువుకు మారింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ధవళేశ్వరంలో దాదాపు 13 సంవత్సరాలు ఉన్న ఈ కార్యాలయం కొన్ని కారణాల వల్ల ఇక్కడికి మారింది. దివాన్‌చెరువులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విశాలమైన భవనంలో దీనిని ఏర్పాటు చేశారు. పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఈ కార్యాలయం ద్వారానే ఉచిత పాఠ్య పుస్తకాల సరఫరా జరుగుతుంది. దాంతో దాదాపు 40 లక్షల పాఠ్య పుస్తకాలు భద్రపరచుకునేందుకు అనువుగా విశాలమైన గోదాము ఉన్న భవనంలో ఈ కార్యాలయం ఏర్పాటైంది.

పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు 18 లక్షల మూల్యాంకన పుస్తకాలు ఈ నెల 27వ తేదీకి దివాన్‌చెరువులోని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయానికి చేరనున్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అందజేసేందుకు 51 టైటిల్స్ మూల్యాంకన పుస్తకాలు రానున్నాయి. ఈ పుస్తకాలు ఇక్కడకు వచ్చాక ఈ కార్యాలయం నుంచి పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు సరఫరా చేస్తారు. ఈ విషయమై జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక కార్యాలయ మేనేజరు పి.సురేష్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఇంతవరకు తమ కార్యాలయానికి 40వేల మూల్యాంకన పుస్తకాలు వచ్చాయని చెప్పారు. మిగిలిన పుస్తకాలు కూడా వచ్చాక మండలాలకు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సెమిస్టర్ పుస్తకాల పంపిణీ పూర్తయ్యిందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గుదల



ఏలేరు జలాశయంలో ఉన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. సాగు అవసరాలకు నీరు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు క్రమేణా తగ్గుతూ వస్తోంది. వర్షాలు సకాలంలో రాకపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 77.10 మీటర్ల స్థాయిలో 10.31 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 150 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 600 క్యూసెక్కుల వంతున నీరు చేరుతోంది. సాగు నీరు విడుదలవ్వడంతోపంటలపై రైతులకు భరోసా వచ్చింది.

సెటిల్ చేసుకోకపోతే షాప్ సీజ్ చేస్తాం!

- ఉమ్మడి జిల్లా పరిధిలోని మెడికల్ షాపుల నిర్వాహకులకు ఫేక్ కాల్స్
- డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అంటూ బెదిరింపు
- కాకినాడ పోలీసులకు ఫిర్యాదు చేసిన జిల్లా కెమిస్టులు

పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మీరు కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారు... వయాగ్రా మాత్రలు అమ్మారు... ఇలా మీ మీద ఫిర్యాదులు వస్తున్నాయి. మేము వస్తే షాప్ సీజ్ చేస్తాం. మీరు వచ్చి డబ్బులు ఇచ్చి సెటిల్ చేసుకోండి అంటూ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామంటూ కొందరు ఆగంతకులు మెడికల్ షాపు యజమానులకు ఫేక్ ఫోన్లు చేస్తున్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని పలు షాపుల నిర్వాహకులకు గత 3 రోజులుగా పదుల సంఖ్యలో ఫేక్ ఫోన్లు రావడంతో కాకినాడ జిల్లా డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్స్ అసోసియేషన్ అప్రమత్తమైంది. కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో జిల్లా సంఘ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కాకినాడతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, తుని, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, ఏలేశ్వరం తదితర ప్రాంతాల్లోని మెడికల్ షాపుల నిర్వాహకులకు కొందరికి 7032461950 నెంబర్ నుంచి కాల్స్ వచ్చినట్టు చెబుతున్నారు. ఇది హైదరాబాదులోని ఒక కాల్ సెంటర్ నుంచి వచ్చినట్టు సమాచారం. ఇవన్నీ తప్పుడు కాల్స్ అని, ఇటువంటివి వచ్చినప్పుడు సంభాషణ రికార్డు చేయాలని డ్రగ్గిస్టు అండ్ కెమిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ కాల్స్ చేసిన వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ చంద్రశేఖర్

జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో మహిళా మెడికోల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



సభలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్, క్రీడాపతాకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రాజానగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో 3 రోజులపాటు జరిగే మహిళా మెడికోల 25వ స్పోర్ట్స్‌మీట్‌ను మంగళవారం ఆయన క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లు గాలిలోకి వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య విద్యతో పాటు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ క్రీడా మైదానంలో మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. యూనివర్శిటీ పరిధిలో జరిగే ఈ పోటీల్లో మొత్తం 24 మెడికల్ అండ్ దంత వైద్య కళాశాలల నుంచి 567 మంది క్రీడాకారిణులు పాల్గొంటున్నట్టు యూనివర్శిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. 3 రోజుల పాటు వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్, చెస్ తదితర క్రీడలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డీవీఎస్ శ్రీనివాసరావు, జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్ మిశ్రా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న వ్యాన్

ఒకరి మృతి

మరొకరికి గాయాలు



ఘటనా స్థలంలో వాహనాలు



చంద్రశేఖర్ (ఫైల్)

ఆలమూరు/అంబాజీపేట జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఆలమూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవరానికి చెందిన వెంపల చంద్రశేఖర్(50) గత కొన్నేళ్లుగా అంబాజీపేట మండలం ఇరుసుమండలో నివాస ముంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఐసర్ వ్యాన్‌తో సోమవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా రావులపాలెం వద్ద ఒక వ్యక్తి రాజమహేంద్రవరం వరకు వస్తానని వ్యాన్ ఎక్కాడు. ఆలమూరు మండలం మడికి వద్ద కూరగాయల మార్కెట్ వద్ద సాంకేతిక లోపంలో ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొంది. దీంతో చంద్రశేఖర్ అక్కడిక్కడే మృతిచెందగా వ్యాన్‌లో ఉన్న మరో ఒక వ్యక్తి గాయపడ్డాడు. దీంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఆలమూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లెట్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు



రాముడు (ఫైల్)

పి.గన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం- అమలాపురం ప్రధాన రహదారి పోతవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ముంగండ శివారు ఇటుకల మెరకకు చెందిన మోకా కళ్యాణ్‌రాముడు (45) తన మేనల్లుడు గణేష్‌నగర్‌కు చెందిన కుసుమ రవికుమార్‌తో కలిసి పి.గన్నవరం వచ్చాడు. తన పని ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో కోకోనట్ కల్యాణ మండపం దాటి కోతవేటు దూరం వెళ్లగానే అమలాపురం వైపు నుంచి బుల్లెట్‌పై గన్నవరం వస్తున్న వ్యక్తి ఢీ కొన్నాడు. ఈ ఘటనలో కల్యాణరాముడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందగా రవికుమార్‌కు గాయాలు కావడంతో గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కల్యాణ్‌రాముడు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ పేర్కొన్నారు.

చోరీ కేసులో 30 గ్రాముల బంగారం, రూ.30 వేల స్వాధీనం

పోలీసుల అదుపులో ఇద్దరు బాలురు



రౌతులపూడిలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

రౌతులపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో 30 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదును రౌతులపూడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నారు. కాకినాడ జిల్లా రౌతులపూడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు మంగళవారం విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈనెల 13న రౌతులపూడిలో పేంటి మరియ్యమ్మ ఇంట్లో 30 గ్రాముల బంగారం, రూ.30,000 నగదు చోరీ జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలతో రౌతులపూడికి చెందిన ఇద్దరు బాలురను మంగళవారం మధ్యాహ్నం రౌతులపూడి గ్రామశివారు మరిడమ్మ గుడి వద్ద అదుపులోకి తీసుకున్నారు. సీసీఎల్ఎస్‌ను జిల్లా పీవో ముందు హాజరుపరిచామని ఎస్ఐ తెలిపారు. దర్యాప్తులో హెడ్‌కానిస్టేబుల్ డివిరమణ, కానిస్టేబుళ్లు బోస్, నూకరాజు, ఉదయ్ ఉన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని విద్యార్థి మృతి



వెంకటేష్ (ఫైల్)

కరప, జూలై 22(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ ఢీకొని కాలేజీకి వెళ్తున్న విద్యార్థి మృతిచెందాడు. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన కోసూరి వెంకటేష్(22) కాకినాడ ఆదిత్య కళాశాలలో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. వెంకటేష్ తండ్రి సుబ్రహ్మణ్యం కాకినాడలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి స్థానిక కొప్పిశెట్టివారిపేటలో చిన్న హోటల్ నిర్వహిస్తోంది. సుబ్రహ్మణ్యం రోజూ కుమారుడిని బండిపై తీసుకెళ్లి కాలేజీ వద్ద దింపి అక్కడి నుంచి డ్యూటీకి వెళ్లేవాడు. మంగళవారం ఉదయం పని ఉందని చెప్పి తండ్రి ముందుగానే డ్యూటీకి వెళ్లిపోయాడు. దీంతో వెంకటేష్ కొద్ది నెలల క్రితం తండ్రి కొనిచ్చిన సుమారు రూ.4లక్షల విలువైన బుల్లెట్‌పై కళాశాలకు బయలుదేరాడు. వేళంగి దళమ్మచెరువుగట్టు వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి వస్తున్న గుర్తుతెలియని మోటర్‌సైక్లిస్ట్ వెంకటేష్‌ను బలంగా ఢీకొని ఆగకుండా పోయాడు. తలకు తీవ్రగాయాలైన వెంకటేష్‌ను తండ్రి సుబ్రహ్మణ్యం హుటాహుటిన కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

మినీ బస్సులో మరణం అంచుకు..

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- అరకు ఘాట్ రోడ్డులో మినీ బస్సు బోల్తా
- 21 మందికి గాయాలు
- లోయలో పడకుండా చూసిన డ్రైవర్
- బాధితులంతా రాజమండ్రి వాసులు
- విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స



ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మినీ బస్సు డ్రైవర్ కుమార్ స్వామి



బోల్తాపడిన మినీ బస్సు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శృంగవరపుకోట, జూలై 22(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ఘాట్ రోడ్డులో మినీ బస్సు మంగళవారం బోల్తా కొట్టింది. ప్రమాదంలో 21 మందికి గాయాలయ్యాయి. డ్రైవర్ కుమార్‌స్వామి చాకచక్యంతో ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. బ్రేకులు ఫెయిలై లోయలో పడాల్సిన బస్సును కొండను ఢీకొనేలా చేయడంతో గాయాలతో బయటపడ్డామని క్షత గాత్రులు తెలిపారు. వారంతా విజయనగరం జిల్లా శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయ పడ్డవారంతా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వాసులు. వారితో మినీ బస్సులో ప్రయాణించిన ఎస్.నాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రాజమండ్రి పరిసర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు 20మంది వరకు రాజమండ్రి జేఎన్ రోడ్డులోని అడమ్ సెలూన్‌లో పనిచేస్తున్నారు. వీరంతా అరకు చూడాలనుకున్నారు. ఓ మినీ బస్సులో సోమవారం రాత్రి రాజమండ్రి నుంచి బయలుదేరారు. మంగళవారం ఉదయం నుంచి బొర్రాగుహలు, అరకు, అనంతగిరి ప్రాంతాల్లో ఉన్న జలపాతాలను చూశాక సాయంత్రం రాజమండ్రికి తిరుగు ప్రయాణమయ్యారు. 6 గంటల సమయంలో శివలింగపురం, టైడా మధ్యకు వచ్చేసరికి మినీ బస్సుకు బ్రేక్‌లు ఫెయిల్ అయినట్లు డ్రైవర్ కుమార్‌స్వామి గుర్తించాడు. రోడ్డుకు ఒక పక్క లోయ, మరోపక్క కొండ ఉంది. బస్సు లోయవైపు లాగేస్తుండగా బస్సు ఆగకుండా చూసి మరోపక్కనున్న కొండను ఢీకొన్నాడు. దీంతో మినీ బస్సు బోల్తా పడింది. బస్సులో ఉన్న వారందరికీ సీట్లు, రాడ్లు, అద్దాలు తగిలి గాయపడ్డారు. కొందరికి తలకు తీవ్రగాయాలు కాగా మరి కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రమాదంపై శృంగవరపుకోట 108 వాహన ఉద్యోగులు ఎంఎస్ఎన్ మూర్తి, రమేష్‌కు సమాచారం అందింది. వారు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని తీవ్రంగా గాయపడ్డవారిని శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఎస్.కోట నుంచి మరో 108 వాహనంలో మరికొందరిని తీసుకొచ్చారు. మిగిలిన వారిని అల్లూరి జిల్లా అనంతగిరి ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో తెచ్చారు. వారందరికీ ఎస్.కోట ప్రభుత్వాసుపత్రి వైద్యులు చికిత్స అందించారు. డ్రైవర్‌తో సహా 21 మంది గాయపడ్డారు. డ్రైవర్ కుమార్ స్వామి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

అన్నవరం దేవస్థానం శానిటరీ కాంట్రాక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం

అన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శానిటరీ వర్కర్స్‌కు పీఎఫ్ చెల్లించకుండా నకిలీ ఈపీఎఫ్ రసీదులను చూపించి కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం అధికారులను మోసం చేసిన విషయంలో కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థపై మంగళవారం రాత్రి దేవస్థానం శానిటరీ విభాగ అధికారులు ఫిర్యాదు చేశారు. ఉదయం ఈవో సుబ్బారావు, శానిటరీ విభాగ అధికారులు రాజమండ్రి పీఎఫ్ కార్యాలయానికి వెళ్లి వివరాలు తీసుకుని న్యాయసలహా తీసుకున్నారు. దీంతో అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంది. సదరు కాంట్రాక్ట్ సంస్థపై చీటింగ్ కేసు నమోదు చేస్తారని సమాచారం. మరోపక్క కాంట్రక్ట్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది. గార్డెన్ నందు ఇదే సంస్థ ద్వారా పలువురు సిబ్బంది పని చేస్తుండగా దానిని రద్దు చేసి మరో కాంట్రాక్ట్ సంస్థకు అప్పగిస్తారో వేచిచూడాలి.

పెరిగిన గోదావరి ప్రవాహం

83,208 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద ప్రవాహం ఒక మోస్తరుగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 83208 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 3800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4700 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద నీటి మట్టం 16.30 అడుగులుగా నమోదైంది.

నేడు 'లోవ'లో సహస్ర ఘటాభిషేకం

తునిరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢ మాస ఉత్సవాలు ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ పండితులు రాణిశర్మ తెలిపారు. అమ్మవారిని సప్తనదీ జలాలతో అభిషేకించి వరుణపూజ నీరాజన మంత్రపుష్పాలతో పూజలు నిర్వహిస్తారన్నారు. 24వ తేదీతో ఆషాఢ మాసోత్సవాలు ముగుస్తాయన్నారు.

చినజగ్గంపేటలో ఆక్రమణలపై సర్వే

ఇరువర్గాల మోహరింపు, ఉద్రిక్తత

పోలీసు బందోబస్తు ఏర్పాటు



మోహరించిన ఇరువర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు



ఆక్రమణలపై సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

గొల్లప్రోలు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో ఆక్రమణలపై అధికారుల సర్వే ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరువర్గాలు భారీగా మోహరించడంతో పోలీసు బందోబస్తు మధ్య సర్వే కొనసాగించారు. గ్రామంలోని 17.35 ఎకరాల విస్తీర్ణంలో గల బూర వారి చెరువు, 14.35 ఎకరాల విస్తీర్ణంలోని వెంకట్రాజు చెరువు, ఎస్సీలకు ఇచ్చిన భూములు ఆక్రమణకు గురయ్యాయని కాకినాడ జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు తహశీల్దార్ పీవీ గోపాలకృష్ణ, పీబీసీ డీఈఈ సంతోష్‌కుమార్, ఏఈ పద్మజ, మండల సర్వేయర్ కేదారేశ్వరరావు ఆధ్వర్యంలో సంయుక్త సర్వే చేపట్టారు. ఆక్రమణలను గుర్తించారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని 2 వర్గాలు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య సర్వేను కొనసాగించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

అమలాపురంలో ఇద్దరు వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు

అమలాపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి లక్షలాది రూపాయలు స్వాహా చేసిన వ్యక్తులపై బాధితులు మంగళవారం రాత్రి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోనసీమ జిల్లా అమలాపురం అశోక్‌నగర్‌కు చెందిన సిరసపల్లి ఉదయ్‌శంకర్, రావులపాలెనికి చెందిన దోనిపాటి మహేష్ మున్సిపల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నామని నమ్మబలికారు. మున్సిపల్ డిపార్టుమెంటులో రికార్డు అసిస్టెంట్, ఫీల్డు అసిస్టెంట్, అక్కౌంటెంట్ తదితర పోస్టులు ఉన్నాయని, పోస్టు ఒక్కింటికీ రూ.1.20లక్షలు, రూ.2.50లక్షలు అవుతుందని ముందుగా సగం సొమ్ము అడ్వాన్సుగా ఇవ్వాలని నమ్మించారు. జాబ్ వచ్చిన తరువాత మిగిలిన సొమ్ము ఇవ్వవచ్చని చెప్పారు. ఉద్యోగాల కోసం ఆశపడ్డ ఆరుగురు రూ.7.20లక్షల సొమ్మును అమలాపురానికి చెందిన యల్లమిల్లి విజయ్, ఉరదాల బాలరాజు, పేరూరుకు చెందిన వాసర్ల శ్రీనివాస్ సమక్షంలో సొమ్ములు చెల్లించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలలు గడిచిపోతున్నా ఉద్యోగాలు ఇప్పించలేదు. ఎప్పుడూ ఏదో ఒక కారణం చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ వ్యహారంపై ఈనెల 12న ఉదయ్‌శంకర్‌ను పట్టుకుని పెద్ద మనుషుల సమక్షంలో పెట్టగా అతడు దోనిపాటి మహేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించడం కుదరదని, డబ్బులు తిరిగి చెల్లిస్తామని పెద్దల సమక్షంలో నమ్మించారు. ఆ తరువాత వారిద్దరు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. ఒక దశలో రూ.6.40 లక్షల నకిలీ చెక్కును ఉదయ్‌శంకర్ పెద్దల సమక్షంలో వేరొకరి సంతకంతో ఇచ్చాడు. ఆ చెక్కు చెల్లదని తమ సొమ్ములు తమకు నగదురూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి నుంచి తాము పెద్ద మనుషుల వద్దకు తిరుగుతూనే ఉన్నామని వివరించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి మోసం చేసిన ఉదయ్‌శంకర్, మహేష్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, తమ సొమ్ములు తమకు తిరిగి ఇప్పించాలని ఫిర్యాదులో కోరారు. అయితే ఈ వ్యవహారంపై అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యవహారంపై అమలాపురం పట్టణ, అల్లవరం పోలీసుస్టేషన్లలో సైతం బాధితులు ఫిర్యాదులు చేశారు. ఇటీవల దోనిపాటి మహేష్‌ను కొందరు కొట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్‌ను ఉన్నత వైద్యం కోసం కాకినాడ తరలిస్తున్నట్టు వైద్యులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మరణించిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారి రాజానగరం-నరేంద్రపురం కూడలిలో మంగళవారం జరిగింది. ప్రత్తిపాడు మండలం ఒ మ్మంగికి చెందిన చవల శ్రీనివాస్(38) కొంతమూరులో ఉంటూ స్కూటీపై ఊరూరా తిరిగి రాగి కడియాలు అమ్ముకుంటున్నాడు. పెద్దాపురంలో మరిడమ్మ తీర్థంలో కడియాలు అమ్ముకునేందుకు కొంతమూరు నుంచి స్కూటీపై బయలుదేరాడు. రాజానగరం- నరేంద్ర పురం జంక్షన్ వద్ద లారీ వెనుక నుంచి ఢీకొం ది. శ్రీనివాస్ తలకు బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.

కోటి తలంబ్రాల పంటకు వానర హారతి





అచ్చుతాపురంలో వివిధ వేషధారణలతో వరిసాగు ప్రారంభిస్తున్న భక్తులు

గోకవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురంలో శ్రీరామ నామ ధ్యాన యజ్ఞంలో భాగంగా మంగళవారం కోటి తలంబ్రాల పంటకు వానర హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామతత్వాన్ని ప్రచారం చేస్తున్న కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణం అప్పారావు ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల జ్ఞాన యజ్ఞం కొన సాగిస్తున్నారు. విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే సద్భావంతో తొలుత విత్తనాలకు భద్రాచలం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పూజలు చేయించారు. అనంతరం అక్కడ నుంచి అచ్చుతాపురం తీసికొచ్చి కళ్యాణం చక్రవేణి పొలంలో చల్లారు. రాముడు, ఆంజనేయుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు వేషధారణలతో భక్తులు ఈ వరిసాగు ప్రారంభించారు. పంట అనంతరం ధాన్యాన్ని నాలుగు రాష్ట్రాల్లోని 5వేల మందికి అందించి తద్వారా వాటిని శ్రీరా మనామస్మరణతో గోటితో ఒలిచి 800 కిలోల తలంబ్రాలను సిద్ధం చేస్తారు, అనంతరం భద్రా చలం (15వ సారి), ఒంటిమిట్ట(8వ సారి), అయోధ్య(4వ సారి)లకు సమర్పించనున్నట్టు సంఘం అధ్యక్షుడు అప్పారావు పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పై దినోత్సవం సందర్భంగా కాపవరం ఉన్నత పాఠశాలలో 68 మంది విద్యార్థులు పై, 22 బై 7 ఆకారంలో కూర్చున్నారు. 22వ తారీఖు, 7వ నెలను అప్రాక్సిమేషన్ డేగా జరుపుకుంటారని హెచ్ఎం చెప్పారు. -బిక్కవోలు.



ఆర్టీసీ సిటీ బస్ సర్వీస్‌లు నడపాలి

- దివాన్‌చెరువులో ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటున్న బస్సులు
- కిక్కిరిసి, వేలాడుతూ ప్రయాణం చేస్తున్న విద్యార్థులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులు, దివ్యాంగులు



దివాన్‌చెరువులో కిక్కిరిసిన ఆర్టీసీ బస్‌లోకి ఎక్కుతున్న ప్రయాణికులు

దివాన్‌చెరువు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్‌ల అవసరాలను పరిగణలోకి తీసుకుని ఏపీఎస్ఆర్టీసీ జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరానికి సిటీబస్ సర్వీస్‌లు నడపాలని ప్రజలు కోరుతున్నారు. రాజానగరం, దివాన్‌చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న విశ్వవిద్యాలయాలు, వృత్తివిద్య కళాశాలలు, విద్యా సంస్థలతో ఈ ప్రాంతం విద్యా కేంద్రంగా ఉంది. అలాగే ఇక్కడకు సమీపంలోని కార్పొరేట్ ఆసుపత్రికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి రోగులు, బంధువులు వచ్చి వెళ్తుంటారు. దీనితో విద్యార్థులు, ఇతర ప్రయాణికులతో బాటు ఆయా సంస్థల్లో పనిచేసే కొంత మంది ఉద్యోగులు కూడా బస్సులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో బస్సులు రద్దీగా ఉంటున్నాయి. ఇక కార్యాలయాలు, విద్యాసంస్థలు ప్రారంభమయ్యే ఉదయం వేళల్లోనూ, పనివేళలు ముగిసే సాయంత్రం సమయాలలోనూ బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. కొంతమంది వేలాడుతూ వేలాడుతూ వెళ్తున్నారు. ఈ కారణంగా దూరప్రాంతాలకు ప్రయాణించవలసిన వారిలో కొంతమంది సీనియర్‌సిటిజన్లు, మహిళలు, దివ్యాంగులు వంటి వారు రద్దీగా ఉన్న బస్సుల్లో ప్రయాణించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం నుంచి రాజానగరం, కడియం, కోరుకొండ వంటి ప్రాంతాలకు రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లను కలుపుతూ సిటీ బస్సులు నడిపితే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందని పలువురు అంటున్నారు. రాష్ట్రంలోని కొన్ని నగరాల్లో ఆర్టీసీ సిటీబస్ సర్వీస్‌లు నడుపుతున్నందున ప్రజావసరాలను పరిగణలోనికి తీసుకుని రాజానగరం, దివాన్‌చెరువు తదితర పరిసర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరానికి సిటీ బస్‌లు నడపాలని దివాన్‌చెరువుకు చెందిన సామాజిక కార్యకర్త సూరారపు డేవిడ్‌రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు న్యాయసేవలపై
అవగాహన అవసరం
డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు న్యాయసేవలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం, బాలికల హాస్టల్, బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ కోటిపల్లి బస్టాండు వద్ద ఉన్న వసతిగృహాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో తాగునీటి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. నీటి ట్యాంకులు శుభ్రత అవసరమని అన్నారు. భోజనాలు చేసే ప్రదేశంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం గుర్తించారు. పలు ఇతర సమస్యలు గమనించారు. కాగా, హాస్టల్స్ విద్యార్థులకు న్యాయసేవల గురించి వివరిస్తూ సమస్యలు ఎదురైనపుడు న్యాయమార్గాలను ఎలా వినియోగించుకోవాలో శ్రీలక్ష్మి తెలియజేశారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన
సీఆర్‌పీఎఫ్ డీఐజీ



కడియం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీని మంగళవారం సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అనీల్ మిన్జ్ సందర్శించారు. ఆయనకు నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందచేసి స్వాగతించారు. అనీల్ నర్సరీలో వివిధ రకాల మొక్కలను తిలకించారు. మొక్కల విశిష్టతలు, పెంపకం, వంటి విషయాలను పెదసత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రకాష్, డిప్యూటీ కమాండెంట్ నితీన్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

అంగన్‌వాడీ పిలుస్తోంది రా! కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి



విద్యార్థినికి విద్యాసామగ్రి అందజేస్తున్న పీడీ లక్ష్మి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకుని పిల్లలందరూ మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి సూచించారు. స్థానిక 21వ వార్డు ఉల్లితోట వీధి అంగన్‌వాడి కేంద్రంలో అంగన్‌వాడి పిలుస్తోంది రా! కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.నాగలక్ష్మి అధ్యక్షతన, సూపర్‌వైజర్ ఆర్.బేబిరాణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడి కార్యకర్త ఎ.సాయిబిందు దాతల సహకారంతో సేకరించిన 15రకాల యూనిఫారాలు, నోట్ బుక్స్, బ్యాగ్స్, లంచ్ బాక్సులను విద్యార్థులకు పీడీ లక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి నల్లం శ్రీను, కొమ్మ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సిబ్బంది, తల్లిదండ్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ పిటిషన్‌పై విచారణ

బిక్కవోలు, జూలై 22(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ పిటిషన్లను ప్రతి మంగళవారం పరిశీలిస్తామని తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో పందలపాకకు చెందిన సత్తి గంగాభవాని తన 60 సెంట్ల భూమిని ప్రభుత్వ భూమిగా చూపుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దార్ ఆ భూముల వద్దకు వెళ్లి రికార్డులు పరిశీలించగా కాలువగట్టు పక్కనే ఈ భూములు ఉండడంతో ఆ సర్వే నెంబరులో ఈ భూములు చేర్చారని, అయితే ఈ 60 సెంట్ల భూమి గంగావతికి చెందిన జిరాయితీ భూమన్నారు. ఈ భూమిని త్వరలో ఆమెకు అప్పచెబుతామన్నారు. తహశీల్దార్ వెంట వీఆర్వో ఓగిరెడ్డి శ్రీను ఉన్నారు.

క్షయ వ్యాధి అంతానికి కృషి చేయాలి

బిక్కవోలు, జూలై 22(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి అంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పందలపాక సర్పంచ్ సబ్బారపు పద్మావతి పిలుపు నిచ్చారు. కొంకుదురు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, పొగాకు ఉత్పత్తులు వాడే వారికి, 60 ఏళ్లు పైబడిన 200 మందికి కఫం పరీక్షలు చేశారు. సర్పంచ్.. వైద్యసిబ్బంది, గ్రామస్థులతో కలసి మానవహారంగా ఏర్పడి క్షయ వ్యాధి అంతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ బి.మహేష్ బాబు, సీహెచ్ఎం శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ నూకరాజు, ఎంఎల్‌హెచ్‌పీ పాప, 104 సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన

కడియం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని మంచి ఫలితాలు సాధించాలని సర్పంచ్ అన్నందేవుల చంటి అన్నారు. మండలంలోనే ప్రప్రథమంగా మా ధవరాయుడుపాలెంలో వెంకట విజ య సీహెచ్‌సీ రైతు సంఘానికి రూ.9.80 లక్షల విలువైన డ్రోన్ మంజూరైంది. దాంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్‌పై గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐదుగురు సభ్యులు న్న సంఘంలో ఒకరికి 10 నుంచి 15 రోజుల పాటు డ్రోన్ వాడకంపై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో పద్మలత, కడియం యూనియన్ బ్యాంక్ మేనేజర్ సుభాష్, డ్రోన్ కంపెనీ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

పరిహారమిస్తేనే అదనపు భూమిస్తాం

- దివాన్‌చెరువులో ఫ్లైఓవర్ పెగ్ మార్కింగ్‌కు వచ్చిన అధికారులు
- భూయజమానుల అభ్యంతరంతో వెనుదిరిగిన వైనం

దివాన్‌చెరువు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులో ఫ్లైఓవర్ నిర్మాణం నిమిత్తం సేకరించిన భూములను మార్కింగ్ చేసేందుకు సిద్ధమైన అధికారులు కొంతమంది భూయజమానుల అభ్యంతరాలతో వెదిరిగారు. ఫ్లైఓవర్ నిర్మాణం కోసం 2015లో సేకరించిన భూములకు 2018లో పరిహారం చెల్లించారు. మరలా 2023లో మరోసారి సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. ఆ ప్రకారం పెగ్ మార్కింగ్‌కు సిద్ధమైన అధికారులకు యజమానులు అభ్యంతరం తెలిపారు. 2015లో చేసిన సర్వే మేరకే పరిహారం ఇచ్చారని, అదనంగా భూములు తీసుకోదలిస్తే దానికి కూడా పరిహారం చెల్లించాలని ఆ తర్వాతే భూమిని సేకరించాలన్నారు. దీంతో తమ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు వారికి తెలిపారు. కార్యక్రమంలో జాతీయరహదారుల సంస్థ డీటీ రమణ, సర్వేయర్ వెంకట్, మండల సర్వేయర్లు అనిత, వెంకటశివ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి



సీనియర్ బేసిక్ స్కూల్‌కు ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరంలో హైస్కూల్ స్థాయికి చేరిన నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్‌కు ఐడీబీఐ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులు రూ.1.75 లక్షలతో సమకూర్చిన కంప్యూటర్, టేబుళ్లు, బెంచీలు, ఫ్యాన్లను బ్యాంక్ రీజనల్ హెడ్ కె.దాస్‌తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, చింతా జోగినాయుడు, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, సనపతి సత్తిబాబు, ఐడీబీఐ బ్రాంచ్ మేనేజరు అనిల్ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో పర్యటన

స్థానిక 49వ డివిజన్ పరిధిలోని సింహాచల్ నగర్ వాంబేకాలనీలో ఎమ్మెల్యే వాసు పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, మెరుగైన పారిశుధ్యం, విద్యుత్ సరఫరాలో సమస్యలను ఆయనకు విన్నవించారు. వాటిపై స్పందించిన ఎమ్మెల్యే కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. వాంబేగృహాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, శిథిలమైన రహదారులు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాచపల్లి ప్రసాద్, దుత్తరపు గంగాధర్, నేమాలి శ్రీను, కేబుల్ మురళీ, పాలవలస వీరభద్రం, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాల్సిందే

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేదలపై విద్యుత్‌ఛార్జీల పెనుభారం పడుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకునేంత వరకూ పోరాటం ఆగదని పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను పరిచయడం చేసి అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పెడతామంటే వ్యతిరేకించిన సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ ఇప్పుడు అదే తప్పు చేయడం సరికాదన్నారు. ప్రధాని మోదీ తీసుకుంటున్న లోపభూయిష్టమైన విధానాల వల్ల దేశంలోని కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికుల జీవన పరిస్థితులు అస్తవ్యస్తంగా మారి రోడ్డు మీదకు వచ్చారన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం, బనకచర్ల ఎత్తిపోతలను తెరమీదకు తేవడం సీఎం చంద్రబాబు తప్పిదాలని అక్కినేని వనజ పేర్కొన్నారు. సీపీ ఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఆగస్టు 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో సీపీఐ జిల్లా మహాసభలు జరుగనున్నాయని, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

అవసరం మేరకు అంచనాలు సిద్ధం చేయాలి

● అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష ● రహదారుల విస్తరణపై ఆరా

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పురోగతిపై జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సమీక్షించారు. మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మురికి వాడల్లో పూర్తిగా సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. వర్షపు నీరు రోడ్లపై నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 17,18,19 డివిజన్లలో మేజర్ డ్రెయిన్ నిర్మాణానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు అనుగుణంగా అంచనాలు సిద్ధం చేయాలన్నారు. టీడీఆర్ బాండ్లు దుర్వినియోగం కాకూడదన్నారు. పుష్కర పనుల్లో భాగంగా చేపట్టిన రహదారుల విస్తరణ పనుల పురోగతిపై ఆరా తీశారు. నగరంలో కొత్తగా అభివృద్ధి చేసిన పార్కులను స్థానిక సొసైటీలు, అపార్టుమెంట్ అసోసియేషన్లకు అప్పగించడం ద్వారా వాటి నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. శంకుస్థాపన జరిగిన పనులు జాప్యంలేకుండా చూడాలని, టెండర్ల పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలకు సురక్షిత తాగునీరు



వడిశలేరులో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలం వడిశలేరు గ్రామంలోని ఊరచెరువు గట్టుపై 15వ ఆర్థిక సంఘ నిధులతో రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా అభివృద్ధి చేసిన వాటర్ ప్లాంట్ ద్వారా మంచినీటి సరఫరా పథకాన్ని నల్లమిల్లి మనోజ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అంతకుముందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎమ్మెల్యే నల్లమిల్లి, మనోజ్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో వడిశలేరులో రూ.12.58 కోట్లతో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. అలాగే వడిశలేరు చేనేత క్లస్టర్ సభ్యుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చేనేత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, ఉద్దంద్రావు శ్రీను, కొమ్మన రాంబాబు, పోతుల వెంకటరావు, అడబాల వెంకటరావు, మాచిన వెంకన్నదొర, చావ శ్రీనివాస్, యు.బుల్లిదొర పాల్గొన్నారు.

వడిశలేరు పర్యటనలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

అనపర్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): అనపర్తిలో ఈనెల 26న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం రామవరంలో ఆయన జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 900 ఉద్యోగావకాశాలు లభించే వీలుందని, పదో తరగతి ఆపై చదువుకున్న వారందరూ వినియోగిచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. 75 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్ల ఇతర డిస్పోజబుల్ వస్తువులను ప్రభుత్వం నిషేధించిందని ఎవరైనా వాటిని వినియోగించినా విక్రయించినా చర్యలు తప్పవన్నారు. వాటి స్థానంలో జ్యూట్ బ్యాగులను, గుడ్డ సంచులను వినియోగించాలని అడిషనల్ కమిషనర్ సూచించారు. ఈ తనిఖీల్లో సచివాయల సిబ్బంది ఉన్నారు.

వైభవంగా మోదకొండమ్మ జాతర

కోరుకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగపట్నంలో మాతృశ్రీ మోదకొండమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని రుడా చైర్మన్ బొడ్డువెంకటరమణ చౌదరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అమ్మవారి అన్నసమారాధన కార్యక్రమాల్లో పాల్గొని రూ.1.50 లక్షలు విరాళం అందజేశారు. గ్రామంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్ల అప్పలనర్సారావు, అడపా వీరబాబు, కోర్పు బుజ్జి, తనకాల బాబు, నాగ రమేష్, నాగా వీరాంజనేయులు, రాజుల నరసింహమూర్తి, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పీ4 దోహదం

ధవళేశ్వరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం పేదవారిని అన్ని విధాలా అభివృద్ధి చేసి వారి స్థితిగతులను మార్చి బంగారు కుటుంబాలుగా తయారు చేస్తుందని తహశీల్దార్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయంలో 3,4,5 సచివాలయాల పరిధిలో బంగారు కుటుంబాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి పీ4 కార్యక్రమ లక్ష్యాన్ని వివరించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఇప్పటికే ఒక్కొక్క సచివాలయం పరిధిలో 16 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పండూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు, నాళ్ల రమేష్, బొబ్బిలి రామకృష్ణ, ఎ. పాండురంగారావు, కరణం రామారావు, దొడ్డి బాబ్జి, పొన్నాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని బొమ్మూరులోని 1, 2 సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథ్ అధ్యక్షతన పీ4 బంగారు కుటుంబాల అవగాహన సమావేశం జరిగింది. దీనికి ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్ విచ్చేసి ప్రభుత్వం ఏవిధంగా సహాయం చేస్తుందో వివరించారు. సమావేశంలో బీమరశెట్టి రమేష్‌కుమార్, పలివెల సత్యనారాయణ, రొంగలి నరసింహనాయుడు, కోటిపల్లి అమ్ములు, పేట వీరలక్ష్మి, నడిగట్ల కామేష్, ఉండవల్లి సతీష్, చిట్టూరి రమణ, సోమన శాంతి, అద్దేపల్లి లక్ష్మిపతి పాల్గొన్నారు.

ఎన్ఎల్ఎంటీం.. అభివృద్ధి పనుల పరిశీలన

సీతానగరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్గొండ, రఘుదేవపురం, సీతానగరం గ్రామాల్లో మంగళవారం ఎన్ఎల్ఎంటీ సభ్యులు ముఖేష్, నాగరాజు పర్యటించి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అధ్యయనం చేసి పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి స్వయం సహాయక సంఘాల సమావేశాల నిర్వహణ, ఎజెండా అంశాలు, సంఘాల ద్వారా రుణాలు పొంది చేపడుతున్న కార్యక్రమాలు, వాటి నిర్వహణ ద్వారా వచ్చే లాభనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, ఏపీడీ క్లస్టర్ సీవో ధారా చంద్రశేఖర్, ఏపీవో సత్యవతి, ఏపీఎం జిలాని, హౌసింగ్ అధికారి సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు

సమగ్ర అభివృద్ధిపై శిక్షణ

కడియం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం స్థానిక మహిళా స్త్రీశక్తి భవన్‌లో ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సంఘ ప్రతినిధులకు, గ్రామ సంఘం సహాయకులకు జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సంఘాలు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. జాబ్‌కార్డులు, ఇంటి నిర్మాణాలు, పెన్షన్లు అర్హులకు చేరువ చేయడంలో కృషి చేయాలన్నారు.

ప్రభుత్వానికి సేవలందించేందుకు సిద్ధం

అనపర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన సేవలందించేందుకు పీఎంపీ అసోసియేషన్ సిద్ధంగా ఉందని అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. మంగళవారం పొలమూరులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన పీఎంపీ, ఆర్ఎంపీల వైద్య విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మండలాల వారీగా పీఎంలు, ఆర్ఎంపీలు అసోసియేషన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. తమ సేవలను ప్రభుత్వం వినియోగించుకునేందుకు వీలుగా మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, మంత్రి సత్యకుమార్‌యాదవ్‌లు కమిటీని ఏర్పాటు చేశారని ప్రభాకరరావు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అనారోగ్యం తాళలేక పురుగుల మందు తాగిన వైనం

సీతానగరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బిల్లంక గ్రామానికి చెందిన పోలిన వెంకట్రావు(70) ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. వెంకట్రావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధలు తట్టుకోలేక సోమవారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకట్రావును కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విగ్రహం తొలగింపుపై ఫిర్యాదు

కడియం, జూలై 22(ఆంధ్రజ్యోతి): చైతన్యనగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో తాము అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశామని, దానిని తొలగించారని, తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని జేగురుపాడు ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ సాకా కిరణ్‌కుమార్, బళ్ళ అన్నవరం, మద్దుకూరి సూరిబాబు, మోతుక మునియ్య సీఐ ఎ.వెంకటేశ్వరరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

రీసర్వే సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అలాగే సీలింగ్ భూముల వ్యవహారం, 22ఏ నిషిద్ధ భూముల సమస్య, సర్వీస్ ఈనాం భూములు, లేఅవుట్ కన్వర్షన్ తదితర అంశాలను అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో రాజానగం, కోరుకొండ, సీతానగరం మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్ వైద్యశాలలో ఇకపై నేత్ర పరీక్షలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరి గట్టునున్న రామకృష్ణ మిషన్ ధర్మ వైద్యశాలలో వేమగిరి పరమహంస నేత్రాలయం సహకారంతో మంగళవారం కంటి పరీక్షల విభాగాన్ని పరమహంస నేత్రాలయ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యర్రా హేమలత ప్రారంభించారు.ఈ విభాగం సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పనిచేస్తుందని,నామ మాత్రపు రుసుముతో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తారని, కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమైన రోగులకు వేమగిరిలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్, స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి లోకమయానంరజీ మహరాజ్, పరమహంస ఏవో కేవీ చలం పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రాజానగరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని సీతారాంపురంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని, సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, నూనె వెంకన్న, పిల్లా సత్యనారాయణ, సంగీత సత్యనారాయణ, చిట్టిప్రోలు పద్దరాజు, అట్లూరి రాజేష్, మల్లారపు సత్యానందం పాల్గొన్నారు.

నగరంలో మూడు జోన్లు

- వీధి వ్యాపారులకు జోన్లుగా విభజన
- అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వీధి వ్యాపారులకు అన్యాయం జరగకుండా జోన్ల వారీగా విభజించినట్టు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం తొలి టౌన్ వెండింగ్ కమిటీతో సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రణాళిక సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి రెడ్‌జోన్, యాంబర్ జోన్, గ్రీన్ జోన్లను గుర్తించినట్టు తెలిపారు. నగర పరిధిలో వీధులన్నీ జోన్ల వారీగా విభజించి నివేదికను సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. విద్యాసంస్థలు, వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించామన్నారు. నిర్దేశిత సమయాలు,నిర్దేశిత రోజుల్లో వ్యాపారాలు చేసుకునే ప్రాంతాలను యాంబర్ జోన్లుగా మిగతా ప్రాంతాలను గీన్ జోన్లుగా ప్రకటించామన్నారు. నగరంలో మొత్తం 68 గ్రీన్ జోన్లు, 17 యాంబర్, 63 రెడ్ జోన్లుగా గుర్తించినట్టు తెలిపారు. పుష్కరఘాట్ సర్కిల్‌ను పూర్తిగా రెడ్‌జోనుగా ప్రకటించామన్నారు.నగరంలో గతంలో 16 వేల మంది వ్యాపారులు ఉండేవారని తాజాగా నిర్వహించిన సర్వేలో 1500 మంది కొత్త వ్యాపారులను గుర్తించినట్టు తెలిపారు. ఈ సమీక్షలో ఏసీపీ బి.నాగలక్ష్మి, వి.కొండలరావు, ట్రాఫిక్ ఎస్ఐ అడపా శివాజీ, సీఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

ఇక శ్రావణానందమే!

- 26 నుంచి శ్రావణమాసం
- మోగనున్న పెళ్లి బాజాలు

అన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం వచ్చిందంటే ఆ సందడే వేరు.. ప్రతి ఇంటా పండగే.. ప్రతి ఇంటా లక్ష్మీ సందడే.. రావమ్మా మహాలక్ష్మి రావమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాలు ఆచరించడం ఆనవాయితీ.. అంటే కాకుండా ఈ మాసం అంతా శుభప్రదంగా ఉంటుందనేది భక్తుల నమ్మకం. ఏ కార్యక్రమైనా ఈ మాసంలోనే తలపెడుతుంటారు. సుమారు 40 రోజుల తరువాత ఈ నెల 26 నుంచి శుభ ముహూర్తాలు జోరందుకోనున్నాయి. మూఢం, ఆషాఢం ఒకేసారి రావడంతో జూన్ 6 తరువాత ఒక్కసారిగా ఆగిపోయిన శుభకార్యక్రమాలు తిరిగి శ్రావణం రాకతో ఊపందుకుంటాయి. ఈనెల 25 నుంచి శ్రావణమాసం ప్రారంభమవుండగా ఆగస్టు 17 వరకు వివాహం, గృహప్రవేశం వంటి శుభముహూర్తాలను పండితులు, పంచాగకర్తలు నిర్ణయించారు. శ్రావణమాసానికి సంబంధించి జూలై 30,31, ఆగస్టు 3,5,7,8,9,10,11,12,13,14,17 తేదీల్లో వివాహాది శుభ ముహూర్తాలను నిర్ణయించారు. వీటిలో జూలై 31, ఆగస్టు 8,9,10,13,14 తేదీల్లో అత్యంత బలమైన ముహూర్తాలుగా పండితులు తెలిపారు. శ్రావణ మాసం శుభముహూర్తాలతో కార్యక్రమాలు నిర్వహించే పురోహితులు, సన్నాయిమేళం, కల్యాణమండపాలకు గిరాకీ ఏర్పడింది. క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు డిమాండ్ నెలకొంది. శ్రావణమాసంలో ఒక్క అన్నవరం దేవస్థానంలో సుమారు 600 వివాహాలు జరగవచ్చని అంచనా. ఆగస్టు 17 దాటితే భాద్రపదమాసం శూన్యమాసం కావడంతో నెలరోజులు శుభకార్యాలకు అవకాశం లేదు. మళ్లీ సెప్టెంబ రు 24 నుంచి నవంబరు 30 వరకు ముహూర్తాలున్నాయి.



పర్యాటకంగా కడియం అభివృద్ధి చేస్తా

కలెక్టర్ ప్రశాంతి



కడియం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : కడియం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి నర్సరీ రైతులకు మేలు చేయాలని కాంక్షిస్తున్నట్టు కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ చాంబర్‌లో సోమవారం పర్యాటక,ఉద్యానవన, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్షించారు.జిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా నర్సరీలు నిలుస్తున్నాయన్నారు.వాటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక విధానంలో సమగ్ర అభివృద్ధి అవసరం అన్నారు. పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దే క్రమంలో మొదటి దశలో పొట్టిలంక నుంచి కడియపులంక వరకు 28 స్టాల్స్‌ను ప్రదర్శనతో పాటు విక్రయాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జేసీ చినరాముడు, పీడీ ఏ.దుర్గేష్, డీహెచ్‌వో మల్లిఖార్జునరావు, జిల్లా పర్యాటక అధికారి వెంకటాచలం, తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో రమేష్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నర్సరీ సంఘం ఉపాధ్యక్షులు జోడపాటి గోపి, ముద్రగడ జమీ, పంతం గణపతి తదితరులు ఉన్నారు.

అనంతపాపం.. బద్దలు!



వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కార్ సీట్‌లో డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం మృతదేహం (ఫైల్)

మళ్లీ వీధికెక్కిన హత్యకేసు

- డ్రైవర్ హత్య కేసులో కీలక మలుపు
- తదుపరి విచారణకు అనుమతి
- ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం తీర్పు
- జగన్ ప్రభుత్వం అనంత ప్రేమ
- పైపై ఆధారాలతో ఛార్జిషీట్
- న్యాయవాది ముప్పాళ్ల పోరాటం
- న్యాయం చేస్తామని లోకేశ్ హామీ
- ఎట్టకేలకు రంగంలోకి పోలీస్
- బెయిల్‌పై ఉన్న అనంతబాబు

(కాకినాడ/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఇన్నేళ్లపాటు పూర్తిగా పక్కన పడిపోయిన కేసును తదుపరి మరింత లోతుగా విచారణ జరిగేలా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ న్యాయ స్థానం మంగళవారం తీర్పునిచ్చింది. పోలీసులు దాఖలు చేసిన తొలి ఛార్జిషీటులో అనేక కీలక వాస్తవాలు విస్మరించిన నేపథ్యంలో బాధితుల విజ్ఞప్తి, ప్రాసిక్యూషన్ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కేసుపై 90 రోజుల్లోగా సప్లమెంటరీ ఛార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించింది. తాజా కోర్టు ఆదేశాలతో కేసు మరింత దర్యాప్తునకు మార్గం సుగమమైంది.

కారులో తీసుకెళ్లి.. డెడ్ బాడీ తెచ్చి..

ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లి హత్య చేశాడు. మే 19 తెల్లవారు జామున మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకొచ్చాడు. పలు పరిణామాల నేపథ్యంలో అనంతబాబును అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. గత వైసీపీ ప్రభుత్వం తన సొంత పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబుపై అవాజ్యమైన ప్రేమ కురిపించింది. అనంతబాబును కాపాడేందుకు కేసును నీరుగార్చేసింది. పైపై ఆధారాలతో న్యాయ స్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో అనంతబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో కొద్దిరోజులు శిక్ష అనుభవించి ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు.

ఇక అన్నీ తేల్చేస్తారు..

ఈ కేసుపై రాజమహేంద్రవరంలో సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు 2018లో తీవ్ర పోరాటం చేశారు. బెయిల్ రద్దు, విచారణ లోతుగా జరిగేలా కృషి చేశారు. అనంతబాబుపై గతంలో రౌడీషీట్ లేదని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొనడంపైనా పిటిషన్ దాఖలు చేశారు. రౌడీషీట్ ఉందని నిరూపించారు. న్యాయం కోసం బాధితులను వెంటబెట్టుకుని హైకోర్టు వరకు వెళ్లారు. అయితే వైసీపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో కేసు నీరుగారిపోయింది. గతేడాది ప్రభుత్వం మారాక కేసు విచారణ మలుపు తిరిగింది. ఎన్నికల సమయంలో బాధితులు నారా లోకేశ్‌ను యు.కొత్తపల్లి సభలో కలిసి తమకు న్యాయం చేయాలని కోరగా అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం మారాక ఈ ఏడాది మార్చి నుంచి కేసులో వేగం పెరిగింది. ఈ కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ముప్పాళ్లను ప్రాసిక్యూషన్‌కు సహకరించేందుకు వీలుగా ఏప్రిల్ 17న ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులకు కేసు తదుపరి విచారణకు అనుమతివ్వాలని కోరుతూ ప్రాసిక్యూషన్ రాజమహేంద్రవరం అట్రాసిటీ న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. హత్య అనంతరం జరిగిన దర్యాప్తులో అనేక కీలక అంశాలను విస్మరించిన నేపథ్యంలో లోతుగా కేసును విచారించాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొంది.తదుపరి విచారణకు అనుమతి మంజూరు చేయాలని కోరింది. మరోవక్క మృతుడి తల్లి నూకరత్నం సైతం తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్న విషయంపై ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేసిన అంశాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. ఈ కేసును తదుపరి విచారించేందుకు వీలుగా పాటిల్ దేవరాజ్ మనిష్ అనే ఐపీఎస్ అధికారిని కాకినాడ జిల్లా ఎస్పీ నియమించిన విషయాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. హత్య కేసులో మరికొందరు సాక్షులను విచారించాల్సి ఉండడం, మరిన్ని సాంకేతిక ఆధారాలు సేకరించాల్సి ఉన్న నేపథ్యంలో తదుపరి విచారణకు అనుమతి కోరింది. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని అట్రాసిటీ న్యాయస్థానం కేసు తదుపరి విచారణకు అనుమతివ్వడంతో మరింత లోతుగావిచారణ జరగనుంది.

తల్లి ఫిర్యాదు.. సిట్ టీమ్

తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్నాయని ఇప్పటికే డీజీపీకి మృతుడి తల్లి నూకరత్నం ఫిర్యాదు చేశారు. దీంతో డీజీపీ కార్యాలయం నుంచి కాకినాడ ఎస్పీ బిందుమాధవ్‌కి వెంటనే యాక్షన్ తీసుకోవాలని ఆదేశాలు అందాయి. విచారణకు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించడంతోపాటు 60 రోజుల్లో నివేదిక ఇచ్చి తదుపరి యాక్షన్‌కు కోర్టును అనుమతి కోరాలని ఆదేశించారు. ఈ ఏడాది కేసు విచారణకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను నియమిస్తూ కాకినాడ ఏఎస్పీ పి.దేవ రాజ్ మనీష్ మెమో జారీచేశారు. ఆ టీమ్‌లో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, ఎస్ఐలు బి.వినయ్‌ప్రతాప్, పి.శ్రీనివాస్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ కె. రామకృష్ణ, కానిస్టేబుల్ ఎం.సతీష్ ఉన్నారు.

కేసుపై మళ్లీ విచారణ

లోతైన విచారణ చేయడంతోపాటు 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాలని కోర్టులో దాఖలైన పిటిషన్‌పై రాజమహేంద్రవరం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కార న్యాయస్థానం న్యాయమూర్తి సింగవరపు ఉమా సునంద మంగళవారం తీర్పు ఇచ్చారు. దీంతో అనంతబాబు వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అనంతబాబుపై తిరిగి పూర్తి విచారణ జరగనుంది. న్యాయసలహాదారుగా న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు.. పీపీలు కె. రాధా కృష్ణ, డి.శ్రీవాణి వాదించారు.

ఎవరూ తప్పించుకోలేరు..



దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో ఎవరూ తప్పించుకోలేరు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు అతనికి సహకరించిన వారికి శిక్ష పడుతుంది. ఇప్పటికే ప్రభుత్వం సిట్‌ను నియమించింది.. సిట్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసి కోర్టుకు సమర్పించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అనంతబాబును కాపాడడానికి శక్తివంచన లేకుండా పనిచేసింది. కానీ ప్రజా పోరాటాల వల్ల కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. ఆనాటి కాకినాడ ఎస్పీ, ఇతర అధికారులు అనేక తప్పిదాలు చేశారు.ఈ కేసులో ఎవరెవరు ఏ పాత్ర పోషించారో తేల్చే అవకాశాలు ఉన్నాయి.

- ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది

సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరిస్తాం

ఎన్‌టీఆర్ వర్సిటీ వీసీ చంద్రశేఖర్



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంగళవారం సందర్శించి మాట్లాడారు. యూనివర్సిటీ నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో చదివేలా ఫ్యాకల్టీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. ర్యాగింగ్ వంటివి జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, బోధనాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ కెన్నడీ,ప్రొఫెసర్లు తదితరులుపాల్గొన్నారు.

జక్కంపూడి రాజా హౌస్ అరెస్టు

- మిల్లు కార్మికుల కోసం దీక్ష
- అడ్డుకున్న పోలీసులు



మాజీ ఎమ్మెల్యే రాజాతో వైసీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాజమహేంద్రవరంలో ఏపీ పేపరుమిల్లు కార్మికులకు వేతన ఒప్పందం విషయంలో మంగళవారం నుంచి నిరవధిక దీక్ష చేస్తానని ఆయన ప్రకటించారు.ఈ మేరకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో త్రీటౌన్ పోలీసులు కృష్ణసాయి కల్యాణ మండపానికి చేరుకుని జక్కంపూడి రాజాను అదుపులోకి తీసుకుని దానవాయిపేటలోని ఆయన నివాసానికి తీసుకెళ్లి హౌస్ అరెస్టు చేశారు.మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ,మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, కౌడా మాజీ చైర్మన్ రాజిరెడ్డి, కర్రి పాపారాయుడు తదితరులు రాజా నివాసానికి చేరుకుని మద్దతుగా నిలిచారు.అనంతరం రాజా విలేకరులతో మాట్లాడుతూ పేపరుమిల్లు కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారు.రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గత ఐదేళ్లూ ఏమయ్యారు : టీడీపీ

గడచిన ఐదేళ్లలో పేపరుమిల్లు కార్మికులకు వైసీపీ ప్రజాప్రతినిధులు ఎందుకు న్యాయం చేయలేకపోయారని టీడీపీ నేతలు యిన్నమూరి దీపు, నక్కా దేవి వరప్రసాద్ ప్రశ్నించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు పేపరుమిల్లు కార్మికుల కోసం దీక్షలు చేస్తామంటున్న వైసీపీ నాయకులు స్థానిక మార్గాని ఎస్టేట్ వద్ద చేస్తే బాగుంటుందన్నారు. ఎందుకంటే మిల్లు కార్మికులకు న్యాయం చేయకుండా పరంపర పేరుతో దోపిడీ చేసిన సొమ్ము భరత్ చేత కక్కించాలన్నారు. త్వరలో మిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేసేందుకు ఎమ్మెల్యే వాసు ,ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్ కృషి చేస్తుంటే ఇప్పుడు రాజకీయం చేయాలనుకోవడం తగదన్నారు.సమావేశంలో నాయకులు ఆదారి లక్ష్మీనారాయణ, చింతపల్లి నాని, కందికొండ అనంత్, జయరామ్ పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న సీఈ

ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం

సీఈ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తేవాలని ఏపీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆవరణలో నిర్మించనున్న ప్రధాన ఆసుపత్రి భవనం స్థలాన్ని, మ్యాప్ ద్వారా డిజైన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈఈ, డీఈలకు తగు సూచనలు చేశారు. నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజ్ భవనం పనులు పరిశీలించి పురోగతిపై ఆరా తీశారు. తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ త్వరలోనే మెడికల్ కాలేజీ శాశ్వత భవనం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రెండేళ్లలో జిల్లా ఆసుపత్రి ప్రధాన భవనాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈఈ చంద్రమౌళి, డీఈ కృష్ణారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షల కార్యక్రమం విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తామన్నారు.



ఈఎస్ఐ ఆసుపత్రి భవనం

ఈఎస్ఐ ఆసుపత్రి.. అదిరే!

- కార్పొరేట్‌కు దీటుగా 100 పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రి
- రూ.56 కోట్లతో రాజమహేంద్రవరంలో నిర్మాణం
- మరో వారంలో ఆరంభించడానికి సన్నాహాలు
- సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆధునిక వైద్య సదుపాయాలతో రాజమహేంద్రవరంలో కార్మిక ప్రభుత్వ బీమా వైద్యశాల (ఈఎస్ఐ ఆస్పత్రి) ఆసుపత్రి సిద్ధమైంది. మరో వారంలో అందుబాటులోకి రానుంది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ మురళీమోహన్ చొరవతో పునాది రాయి పడింది. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తుది మెరుగులు అద్దుకుని వైద్య సేవలకు సన్నద్ధమైంది. వైద్య పరికరాలు/యంత్రాలు/వస్తువులు ఇంకా రావాల్సి ఉంది. ఐదేళ్ల కల సాకారం కావడం, పేద కార్మికులకు అధునాతన వైద్య సదుపాయం అందుబాటులోకి రానుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

రూ.56 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం

ఆస్పత్రి నిర్మాణానికి రూ.97.98 కోట్లను 2020 ఆగస్టు 19న కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 5.83 ఎకరాల విస్తీర్ణంలో రూ.56 కోట్లతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. వాస్తవానికి 2022 జూలై 10వ తేదీకి నిర్మాణం పూర్తి కావాల్సి ఉన్నా 2024 డిసెంబరు 30కి పూర్తయింది. ఆరు నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఈఎస్ఐ కార్పొరేషన్ బదిలీ చేసింది. 1987లో 50 పడకల ఆస్పత్రిగా సేవలు ప్రారంభించగా ఇప్పుడు 100 పడకల ఆస్పత్రిని నిర్మించారు. అయితే ఆ స్థాయికి అప్ గ్రేడ్ కావాల్సి ఉంది. అప్పుడే ఆ స్థాయికి తగి నట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయి. ఇప్పటికే ఆస్పత్రికి అవసరమయ్యే యంత్రాలు,పరికరాలు, మానవ వనరులు, నిర్వహణ వంటి వాటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఏర్పాటు చేయకపోవడంతో బయటి ఆస్పత్రులకు రిఫర్ చేయడం తప్పకపోవచ్చు. భారీ వ్యయంతో నిర్మించిన ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.ఎంపీ పురందేశ్వరి కల్పించుకుని పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది, యంత్ర పరికరాలు త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కార్మికులు కోరుతున్నారు.

ఏ ఫ్లోర్‌లో ఏముంటాయి..

గ్రౌండ్ ఫ్లోరులో 32 గదుల్లో ఓపీ, వ్యాధి నిర్ధారణ, ఈసీజీ,ఎక్స్‌రే, క్యాజువాలిటీ, క్యాజు వాలిటీ ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, క్యాంటీన్, లాండ్రి, ఆయుర్వేద,హోమియో, ఎమర్జెన్సీ వార్డు,ఫిజియోథెరపీ తదితర సేవలు ఉంటాయి.రెండో ఫ్లోరును పూర్తిగా మాతా శిశువుల కోసం కేటాయించారు.వారికి సంబంధించిన అన్ని వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐసీయూ, పీఐసీయూ, హెచ్‌డీయూ, ఎన్ఐసీ యూ, ఎస్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ప్రొసీజర్ రూమ్స్, లాకర్లు ఇలా 26 రూములు నిర్మించారు. మూడో ఫ్లోరులో 12 పడకల చొప్పున 6 వార్డులు ఉండగా.. పురుషులకు, మహిళలకు విడివిడిగా విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు.వార్డుల్లో సైతం ఆక్సిజన్, వెంటిలే టర్, వంటి సదుపాయాన్ని కల్పించారు. ఇదే ఫ్లోరులో లైబ్రరీ, బ్లడ్ స్టోరేజీ, ఎంఆర్‌డీ, పరిపాలన గదులు ఉంటాయి. వైద్యులు, సిబ్బంది క్వార్టర్స్ ఆస్పత్రి ప్రాంగణంలోనే నిర్మించారు. టైప్ 2, 3, 4, టైప్ 4 స్పెషల్ విభాగాలుగా మొత్తం 32 ప్లాట్లు ఉన్నాయి.

12 డిస్పెన్సరీలకు పెద్దాసుపత్రి..

ఆస్పత్రి పరిధిలో రాజమహేంద్రవరం, సీతంపేట, లాలా చెరువు, ఇన్నీసుపేట, కడియం, ధవళేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, వేంద్ర డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల నుంచి కార్మికులను ఈ ఆసుపత్రికి రిఫర్ చేస్తారు.

ఔరా అనిపించేలా..



ఆసుపత్రిని ఔరా అనిపించేలా నిర్మించారు. మహిళా శిశు వైద్య విభాగానికి ఏకంగా ఒక ఫ్లోర్‌నే కేటాయించారు.ఈ విభాగం అద్భుతమనే చెప్పాలి. సెకండరీ కేర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, ఆర్థో, ట్రామా కేర్‌తో సహా 26 రకాల వైద్య సేవలను అందించనున్నారు. సెంట్రల్ ఏసీ సదుపాయంతో పాటు భద్రతకు 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రీనరీ, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, లాండ్రీ, క్లాత్ వాషింగ్ ఇలా అన్ని సదుపాయాలు ఆధునికంగానే ఉన్నాయి. ప్రతి వార్డులోని ప్రతి మంచం వద్ద ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం ఉంది. రోగులు వేచి ఉండే ప్రదేశం, ఆపరేషన్ థియే టర్లు విశాలంగా నిర్మించారు.స్ట్రెచర్ పట్టే విధం గా నాలుగు లిఫ్టులు ఉన్నాయి. అంధులు ఇబ్బంది పడకుండా మెట్లు, లిఫ్టుల వద్ద బ్రెయి లీ లిపితో బోర్డులు ఏర్పాటు చేశారు.



ఈఎస్ఐ ఆసుపత్రి లోపల విభాగం

సిబ్బంది కావలెను..

ప్రస్తుతం 50 బెడ్స్ స్థాయిలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్, పరిపాలన కలిపి కేవలం 30 మంది మాత్రమే ఉన్నారు. కొత్త ఆస్పత్రిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే కనీసం 300-350 మంది సిబ్బంది అవసరం అవుతుంది. మూడు కుసైగా ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర వైద్య విభాగాలు ఉండడంతో షిఫ్టుల వారీగా పనిచేయాల్సి వస్తుంది. అందువల్ల 100 మంది వరకూ డాక్టర్లు ఉండాలి. ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ సిబ్బంది 200 మంది వరకూ అవసరం అవు తుంది. వీరిని ప్రభుత్వం నియమించే వరకూ ఉన్నవాళ్లతో నెట్టుకురాక తప్పని పరిస్థితి ఉంది. కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రిని కేంద్ర ప్రభుత్వమే చూసుకుంటుంది. రాజమహేంద్రవరం ఆస్పత్రి నిర్వహణ అంతా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

కొవ్వూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కార్మికుల న్యాయమైన డిమాండ్లపై భవిష్యత్ కార్యాచరణతో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వ స్పందన కార్మికులలో అసంతృప్తిని మిగిల్చిందన్నారు. గత సమ్మె కాలపు ఒప్పందాలు, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే భవిషత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమ్మెకు మద్దతు ఇచ్చిన సంఘాలకు, సంస్థలకు, పట్టణ ప్రజానీకానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం నుంచి కార్మికులు యథావిధిగా విధులకు హాజరవుతారన్నారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడితే హక్కులను సాధించుకోగలరన్నారు. కార్యక్రమంలో భూపతి రవీంద్ర, పూజారి వాసు, కళ్యాణి రాజేష్, శివశంకరజ్యోతి, రాజాన అప్పారావు, కారకి దుర్గాప్రసాద్, అల్లం వాణిపూర్ణ, అల్లం వెంకట వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సత్యనారాయణ

పెరవలి, జూలై22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశు వర్ధకశాఖ వారిచే నిర్వహిస్తున్న ముద్దు చర్మ వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం ద్వారా పశువులను రక్షించుకోవచ్చునని కొవ్వూరు డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ సుంకవల్లి సత్యనారాయణ అన్నారు. పెరవలి మండలం ముక్కామల, కొత్తపల్లి అగ్రహారం గ్రామాల్లో తెల్ల పశువులకు ఉచితంగా టీకాలు కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 1200 డోసులు టీకాలు ప్రభుత్వం వారిచే సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సహాయ సంచాలకుడు డాక్టర్ వి.రుషిప్రసాద్, డాక్టర్ పి.రాజేంద్రప్రసాద్, కండవల్లి పశువైద్యాధికారి డాక్టర్ సల్మా, జూనియర్ వెటర్నరీ అధికారి పి.వనిత పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ బ్రెయిన్ డే

తాళ్లపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పాఠశాలల్లో వరల్డ్ బ్రెయిన్ డేను ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడి విజేత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బయాలజీ టీచర్ ఎం.కరుణ విద్యార్థులకు బ్రెయిన్ మోడ ల్‌ను చూపుతూ అది పనిచేసే తీరును వివరించారు. ప్రధానో పాధ్యాయులు ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ధ్యానం, యోగా చేయడం ద్వారా మానసిక వత్తడి తగ్గి నాడీ కణాలు చురుగ్గా పనిచేస్తా యని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు గంగారత్నం, నిస్సీ, కరిష్మా, వెంకగ్ విజ య్ తదితరులు పాల్గొన్నారు.

'జవహర్ ఫ్లెక్సీలను చింపివేయడం దారుణం'



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

కొవ్వూరు/తాళ్లపూడి/నిడదవోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్ ఫ్లెక్సీలను చింపివేయడం దారుణమని దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు చోళ్ల రాజు అన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలులో పలువురు దళిత నాయకులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కొవ్వూరు,వాడపల్లి, పశివేదలలో ఆయన ఫ్లెక్సీలు చింపివేసి ఆయనను మనోవేదనకు గురిచేస్తున్నారన్నారు. మాల మహానాడు స్టేట్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంటు మాసా ఆనంద్ మాట్లాడుతూ వ్యక్తిగత హక్కులు కాలరాసే అధికారం ఎవరికీ లేదన్నారు.దాసరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ జవహర్‌కు ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. జవహర్ పట్ల కొంత మంది నాయకుల చర్యలను ప్రశ్నిస్తు న్నామని టీడీపీ రీజనల్ ఎస్సీ కోఆర్డినేటర్ ఆకుమర్తి చిన్నామాదిగ అన్నారు. జవహర్ ఫ్లెక్సీని చింపిన వారిపై కఠినచర్యలు తీసు కోవాలని బాబూ జగ్జీవన్‌రామ్ సేవా సమితి అధ్యక్షుడు బైపే రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహాసభ జిల్లా ప్రెసిడెంటు రాపాక సహదేవుడు,నాగవరపు అచ్యుతరావు, మాసాజాన్, పసలపూడి సుభాష్ చంద్రబోస్, పొలోజు జయరాజు, కొప్పాక పోసి య్య, మెరిపో వెంకట్రావు, కైకరపు రత్నం, ఆశీర్వాదం, కొడమంచిలి జార్జ్, వర్మ పాల్గొన్నారు.

చాగల్లు ఎత్తిపోతల పథకం

అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



బ్రాహ్మణగూడెంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చాగల్లు ఎత్తిపోతల పథకం అభివృద్ధికి రూ.కోటి 50 లక్షల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసినట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం చాగల్లు ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించారు. చాగల్లు ఎత్తిపోతల పథకం రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లు మరమ్మతులకు నోచుకోలేని పరిస్థితిలో ఆయకట్టు రైతులు నీటితీరువాకు అదనంగా రైతుకి రూ.2వేలు వంతున సుమారు రూ.10 లక్షలు సేకరించి మరమ్మతులు నిర్వహించినట్లు చెప్పారు. ఇప్పటి కి ఒక మోటారు మాత్రమే తిరుగుతుందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కొవ్వూరు నియోజకవర్గం పర్యటనలో నియోజకవర్గంలోని ఐదు ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు నిర్వహించి అభివృద్ధి చేయాల్సిన అవసరం గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే వచ్చే ఖరీఫ్ సీజన్‌కి ఎత్తిపోతల పథకంను అభివృద్ధి చేస్తామని చెప్పారు. బ్రాహ్మణగడెం ఎత్తిపోతల పథకంను పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు.

కొవ్వాడ కాలువ ముంపు నివారణకు చర్యలు

ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామా ల్లో కొవ్వాడ కాలువ పరివాహక ప్రాంత వరిపంట నీటమునిగిందని రైతులు ఆవేదన మేరకు పంట పొలాలను సందర్శించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముంపు నివారణకు ఇరిగేషన్, ఎత్తిపోతల పథకం, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారంకోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆదేశించారు. దారవరంలో కొవ్వాడ కాలువ అప్పారావు కెనాల్‌లో కలిసే ప్రాంతంలో ఆక్రమణల వలన నీటి ప్రవాహం తగ్గి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని లిఫ్ట్ ఇరిగేషన్ అధికా రులు తెలిపారు. ఆక్రమణలు తొలగించే విధంగా మార్కింగ్ చేయాలని తహసీల్దార్ ఎం.మెరికమ్మను ఆదేశించారు. విజ్జేశ్వరం లాకుల నుంచి నీటి విడుదలను తగ్గించినట్లు చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మండల కేంద్రమైన చాగల్లులో ఆరుగురుకి మంజూరైనసీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.నందిగంపాడు, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు గ్రామాలకు ఒక్కొక్కటి వంతున మొత్తం తొమ్మిది మందికి రూ. 5,99,497 విలువగల చెక్కులను అందజేశారు. అనంతరం బ్రాహ్మణగూడెం, కలవలపల్లి గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, జెడ్పీటీసీ గారపాటి విజయదుర్గ శ్రీనివాస్, టీడీపీ నాయకులు కొఠారు అశోక్ బాబా, గారపాటి బాబురావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, ఈడుపుగంటి మురళి, అబ్బూరి సీతారాముడు, దొమ్మేటి వేణు తదితరులు పాల్గొన్నారు.

'ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి'

పెరవలి, జూలై22(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మేరీ కిరన్ అన్నారు. మండలంలోని కాకరపర్రులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరి రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలుద్వారా రైస్ మిల్లుకు తరలించాలన్న ఈ క్రాప్ అవసరం అన్నారు. ప్రభుత్వం నుంచి అందే అన్ని పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నా రు.

ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దు

పెరవలి, జూలై22(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దని విజయవాడకు చెందిన డాన్‌బాస్కో నవజీవన బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లాల క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీతేజ అన్నారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో కాకరపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు విద్యార్థులకు సైబర్ నేరాలు వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలుపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న ప్రస్తుత కాలంలో వాటి బారిన పడకుండా వారి భారిన పడకుండా ప్రతీ ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు సూర్యచంద్రరావు(ఫైల్)

కొవ్వూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు.కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన కొనగళ్ళ సూర్యచంద్రరావు(59)ఈనెల 20వ తేదీన టీవీఎస్ మోపెడ్ పై కొవ్వూరు బయలుదేరాడు మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సూర్యచంద్రంను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు కొనగళ్ళ ప్రసా ద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పొలంలో గుళికలు చల్లుతున్న కూలీలకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పలకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకపల్లి గ్రామంలో పంట పొలంలో గుళికలు చల్లుతున్న వ్యవసాయ కూలీలు వాటి వాసనకు అస్వస్థతకు గురైన సంఘటన చోటు చేసుకుంది. దీంతో వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సచేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. వారిలో నందిగం రాజు, కదిలి గంగ రాజు, గర్నికూటి ముత్యాలరావు, గెడ్డం సత్యాన ందంలను ఎమ్మెల్యే ముప్పిడి వెంక టేశ్వరరావు కలిసి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఎమ్మె ల్యే వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దిపాటి ప్రకాశం ఉన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

ఉండ్రాజవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చివటం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీస్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొంటారని చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని రామకృష్ణ కోరారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ

● నగదు బంగారం అపహరణ

నిడదవోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళంవేసి బంధువులు ఇంటికి ఊరికి వెళ్లిన వారి ఇంటిలో దొంగలు పడి డబ్బు బంగారం దోచుకుపోయిన సంఘటన నిడదవోలులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నిడదవోలు పట్టణంలోని సంజీవ య్యనగర్‌లో నివాసం ఉంటున్న గరిమెళ్ళ నాగేశ్వరరావు తన కుటుంబంతో బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లారు. తాళంవేసి ఉన్న ఇంటిని గుర్తించిన దొంగలు ఆ ఇంట్లోపడి మూడు కాసుల బంగారు వస్తువులు, లక్ష రూపాయల నగదు దోచుకుపోయారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

దేవరపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కే.కమలరాజు పేర్కొన్నారు. మండలంలోని రామన్నపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలాల్లో నానో యూరియా చల్లడం వల్ల నత్రజని చేరి పంట ఏపుగా పెరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎప్పటికప్పుడు ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలోత్సవ భవన నిర్మాణానికి స్థలం మంజూరు



స్థలం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో బాలోత్సవ కమిటీ భవన నిర్మాణానికి 6 సెంట్లు స్థలాన్ని మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ కేవీకే దుర్గారావుకు పంచాయతీ తీర్మానం ఇచ్చిన సర్పంచ్ కడిమి వీరకుమారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బాలోత్సవ కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవ కమిటీ భవన నిర్మాణానికి 6సెంట్లు స్థలాన్ని మంజూరు చేయాలని తాము ఎంపీపీ దుర్గారావును కోరామని, అందుకు స్పందించి స్థలం మంజూరు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడిమిరాజు, వార్డు సభ్యుడు పచ్చా రామ్‌గోపాల్, దుగ్గిన గంగాధర్, బాలోత్సవ కమిటీ సభ్యులు నలమాటి రామారావు, చల్లా సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దోమతెరల అందజేత



బాలురకు దోమతెరలు పంపిణీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

గోపాలపురం, జూలై22 (ఆంధ్రజ్యోతి): వ్యాధి కారకాలైన దోమలను నియంత్రించేందుకు దోమతెరలు ఉపయోగపడతాయని తహశీల్దార్ అజయ్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన గోపాలపురంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు రెవెన్యూ శాఖ ఆర్థిక సాయంతో సమకూర్చిన దోమతెరలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వసతిగృహాలను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో విద్యార్థులను సమస్యలు అడగడంతో తమకు దోమతెరలు లేక దోమల బారిన పడుతున్నామని తెలిపారన్నారు. అందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు దోమతెరలను కొనుగోలు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఆర్ఐ నాగసునీత, సీనియర్ అసిస్టెంట్ హరీశ్, రెవెన్యూ సహాయకులు మనోహర్, నాని తదితరులు పాల్గొన్నారు.

గోదావరికి పెరిగిన వరద ప్రవాహం

● 83,208 క్యూసెక్కులు సముద్రంలోకి ● 10600 క్యూసెక్కులు డెల్టా కాలువలకు ..

ధవళేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలు వల్ల గోదావరికి వరద ప్రవాహం ఒక మోస్తరుగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 83208 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాలకు తూర్పు డెల్టాకు 3800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4700 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద నీటి మట్టం 16.30 అడుగులుగా నమోదయింది.

పెద్దాపురంలో జాతీయ జెండా దినోత్సవం



పెద్దాపురం ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండాలతో విద్యార్థులు

గోపాలపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా దినోత్సవాన్ని మండలంలోని పెద్దాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు కాకి పోసియ్య మాట్లాడుతూ జాతీయ జెండా దేశసమగ్రతకు సమెక్యతకు గుర్తు అని అన్నారు. పింగళి వెంకయ్య రూపొందించిన ఈ పతాకాన్ని తిరంగ్ లేదా త్రివర్ణ పతాకం అని పిలుస్తారన్నారు. 1947వ సంవత్సరం జూలై 22న ఈ జెండా రాజ్యాంగ సభలో ఆమోదించబడిందన్నారు. మూడు రంగుల మధ్యలో ధర్మచక్రం, పైన కాషాయం రంగు, మధ్యలో తెలుపు, కింద ఆకుపచ్చ రంగులు ఉంటాయన్నారు. కాషాయం స్వచ్ఛతకు ఆధ్యాత్మిక త్యాగానికి గుర్తని తెలుపు శాంతికి, సత్యానికి గుర్తని, ఆకుపచ్చ రంగు సాఫల్యతకు, సమృద్ధికి చిహ్నమన్నారు. అశోక ధర్మచక్రం 24గంటలు ధర్మం, న్యాయానికి గుర్తు అని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే జాతీయ జెండా పట్ల గౌరవం ఏర్పడినప్పుడు మంచి సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నమణి, రాజశేఖర్, చిమటపల్లి రాజు, సీఆర్పీ కొయ్యే నాగరాజు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



ముద్దాయి శేఖర్‌ను రాజమండ్రి కేంద్ర కారాగానికి తీసుకొచ్చిన పోలీసులు

గోపాలపురం, జూలై 22: (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని కరగపాడు గ్రామానికి చెందిన మర్రి శేఖర్‌. ఓ హత్య కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి తప్పించుకు తిరుగుతూ మంగళవారం ఉదయం గ్రామంలోకి వచ్చాడన్న సమాచారంతో తన సిబ్బందితో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ మనోహర్ తెలిపారు. శేఖర్ 2016లో తన భార్యను హత్య చేశాడు. దీంతో కోర్టు అతడికి రిమాండ్ విధించింది. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన శేఖర్ గత డిసెంబర్ నుంచి సుమారు 8నెలల పాటు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో కోర్టు ఉత్తర్వుల మేరకు మంగళవారం ఉదయం గ్రామంలోకి వచ్చాడన్న సమాచారంతో తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. అనంతరం కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎదుట హాజరుపరచగా శేఖర్‌కు 14రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు. దీంతో అతడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి అప్పగించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేదలపై విద్యుత్‌ఛార్జీల పెనుభారం పడుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకునేంత వరకూ పోరాటం ఆగదని పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను పరిచయడం చేసి అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పెడతామంటే వ్యతిరేకించిన సీఎం చంద్రబాబు, లోకేశ్ ఇప్పుడు అదే తప్పు చేయడం సరికాదన్నారు. ప్రధాని మోదీ లోపభూయిష్టమైన విధానాల వల్ల దేశంలోని కోట్లాది మంది అసంఘటిత కార్మికుల జీవన పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింహాద్రిరావు

నల్లజర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పథకాల అమలుపై ప్రతి డ్వాక్రా మహిళకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సింహాద్రిరావు అన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం శ్యాం సుందర్ అధ్యక్షతన డ్వాక్రా సీఏలు, మండల సమాఖ్య సభ్యులు, గ్రామ సంఘ అధ్యక్షులు, వీఏలకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో మహిళలను భాగస్వాములు చేయాలన్నారు. జాబ్ కార్డులు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం కోసం లోన్లు, సామాజిక భద్రత పింఛన్ వంటి పథకాలు మహిళల పేరుతో వసున్నాయన్నారు. డ్వాక్రా మహిళలకు ఇటువంటి పథకాలపై అవగాహన కల్పిస్తే వారి ఆర్థికాభివృద్ధికి సహాయం చేసినట్లు అవుతుందన్నారు. గ్రామ స్థాయిలో మహిళలను చైతన్యం చేసి కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు వంటి వాటికి బ్యాంకు లింకేజీ లోన్స్ అందించి వారిని ఆదుకోవాలన్నారు.

గోపాలపురంలో బంగారు కుటుంబాల సర్వే



గోపాలపురంలో సర్వే చేస్తున్న ప్రత్యేకాధికారి జోడాల

గోపాలపురం, జూలై22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణలో బంగారు కుటుంబాలు మార్గదర్శి ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు గోపాలపురం పట్టణ పీ4 ప్రత్యేకాధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం గోపాలపురం సచివాలయం 1, 2, 3లో తహశీల్దార్ అజయ్‌బాబు, ఎంపీడీవో రాజ మహూర్ పర్యవేక్షణలో 34 బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఆ కుటుంబాల స్థితిగతులను మార్గదర్శులకు వివరించగా వారు అర్థం చేసుకుని స్వచ్ఛందంగా ముందుకొచ్చారన్నారు. మార్గదర్శకులుగా మద్దిపాటి రమేశ్, జ్యేష్ఠ శ్రీధర్, భూరెడ్డి వాసులను కలవగా వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, వీఆర్వోలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయసేవలపై అవగాహన అవసరం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి.. రాజమహేంద్రవరంలోని పలు హాస్టళ్ల తనిఖీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు న్యాయసేవలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం, బాలికల హాస్టల్, బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ కోటిపల్లి బస్టాండు వద్ద ఉన్న వసతి గృహాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో తాగునీటి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. నీటి ట్యాంకులను శుభ్ర పరచవలసిన అవసరం ఉందని అన్నారు. భోజనాలు చేసే ప్రదేశంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం గుర్తించారు. పలు ఇతర సమస్యలు ఆమె గమనించారు. కాగా, హాస్టల్స్ విద్యార్థులకు న్యాయసేవల గురించి వివరిస్తూ సమస్యలు ఎదురైనపుడు న్యాయమార్గాలను ఎలా వినియోగించుకోవాలో శ్రీలక్ష్మి తెలియజేశారు.